నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నల్లగొండ
శనివారం | మార్చి 16, 2024 | www.navatelangana.com

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 12 పరీక్ష కేంద్రాలు-2650 మంది విద్యార్థులు
- ఎంఈఓ బాలాజీ నాయక్

నవతెలంగాణ-మిర్యాలగూడ

పదోతరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీస్‌శాఖల సహకారంతో అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలో 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 2650 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఎవరు కూడా సెల్‌ఫోన్ వాడకుండా నిషేధిత ప్రదేశంగా ప్రకటించినట్టు పేర్కొన్నారు. ఈ నెల18 నుండి 30 తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుండి 12.00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు 5 నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామన్నారు.


సర్వే బిల్లును చెల్లించాలని వినతి

నవతెలంగాణ-నాంపల్లి



మండలంలో పనిచేస్తున్న ఆశా వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని, లెప్రసి సర్వే బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు ఆశా వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలోశుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇస్రాత్ ఉన్నిసా కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఏకనాదం, ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)నాంపల్లి మండలం ప్రధాన కార్యదర్శి మెగావత్ సునీత, మండల కమిటీ సభ్యులు సిహెచ్ సైదమ్మ కె రేణుక తదితరులు పాల్గొన్నారు.

పవరే..ప్రాణం



నాయకులకు అధికారమే పరమావధి

- పార్టీలు మారుతున్న నేతలు
- ఉమ్మడి జిల్లాలో పవర్ పాలిటిక్స్

నవతెలంగాణ -మిర్యాలగూడ

ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాయకులు అధికారమే పరమావధిగా పార్టీలు మారుతూ పవర్ పాలిటిక్స్‌కు తెరలేపారు. పార్టీలు, జెండాలు వేరైనా చివరికి అధికారంలో ఉన్న పార్టీలోకి చేరి పవర్ చేలాయించడమే వారి లక్ష్యం. అధికారంలో ఉన్న మజా వేరు అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అన్ని పార్టీల నాయకుల తీరు పవరే ఆక్సిజన్‌గా మారింది.

5వసారి పార్టీ మారుతున్న గుత్తా...?

ఉమ్మడి నల్గొండ జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి ఐదవ సారి పార్టీ మారబోతున్నట్లు ప్రచారం జరుగుతుంది. బీఆర్ఎస తరుపున శాసనమండలి చైర్మెన్‌గా ఉన్న గుత్తా తన తనయుడు గుత్తా అమిత్ రెడ్డికి నల్గొండ, భువనగిరి ఏదైనా ఒక స్థానం నుంచి ఎంపీ టికెట్ ఆశించారు. టికెట్ కోసం అధిష్టానంపై గట్టి ఒత్తిడి తీసుకురావడంతో ఉమ్మడి జిల్లాలోని ఆ పార్టీ నేతలతో కేసీఆర్ అభిప్రాయాలు సేకరించారు. ఒక్కరు తప్ప అందరూ అమిత్ రెడ్డి అభ్యర్థితత్వాన్ని వ్యతిరేకించారు. అప్పటివరకు ఆ పార్టీ అధినేత అమిత్ రెడ్డికి టికెట్ ఇవ్వాలని ఆలోచన చేసినప్పటికీ ముఖ్య నేతల నుంచి వ్యతిరేకత రావడంతో మనసు మార్చుకుని మరో అభ్యర్థిని ఎంపిక చేసే విషయంలో కసరత్తు చేస్తున్నారు. దీంతో అమిత్ రెడ్డి పోటీ చేసే విషయాన్ని విరమించుకుని అధిష్టానానికి పోటీ చేయనని తేల్చి చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ తరపున భువనగిరి పార్లమెంటు స్థానానికి టికెట్ ఆశించి ఆ పార్టీ ముఖ్య నేతలతో చర్చలు జరుపుతున్నారు.

గుత్తా సుఖేందర్ రెడ్డి రాజకీయ ప్రవేశం తొలత కమ్యూనిస్టు పార్టీతో ప్రారంభమైంది. తన సొంత ఊరైన చిట్యాల మండలం ఊరుమడ్ల గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్‌గా కమ్యూనిస్టు పార్టీ తరపున ఎన్నికయ్యారు. టీడీపీలో చేరి ఆ పార్టీ హయాంలో నార్మల్ డెయిరీ చైర్మెన్‌గా పనిచేశారు.1999లో నల్గొండ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2004లో నల్గొండ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతిలో ఓడిపోయారు. 2009 ఎన్నికల్లో రాత్రికి రాత్రి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ తరపున ఎంపీ టికెట్ తెచ్చుకొని గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ తరపున మళ్లీ పోటీ చేసి గెలుపొందారు. అప్పుడు రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. రెండేండ్లు గడిచాక అప్పటి మిర్యాలగూడ, దేవరకొండ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కరరావు ,రవీంద్ర కుమార్ నాయక్ లతో కలిసి టీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ మంత్రి హయాంలో గుత్తా ఎమ్మెల్సీగా ఎన్నికై రెండుసార్లు శాసనమండలి చైర్మెన్‌గా పనిచేశారు. తన తనయుడు అమిత్ రెడ్డికి బీఆర్ఎస్ తరుపున అసెంబ్లీ టికెట్ కు ప్రయత్నించి విఫలమయ్యారు. ఎంపీ టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేయగా అధిష్టానం నుండి హామీ రాకపోవడంతో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. భువనగిరి ఎంపీ టికెట్ ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరగా ఎమ్మెల్సీ ఇస్తామని భరోసా ఇచ్చినట్టు సమాచారం. ఇప్పటివరకు గుత్తా సుఖేందర్ రెడ్డి నాలుగు పార్టీలు మారారు. తిరిగి మళ్లీ కాంగ్రెస్‌లో వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

మాజీ డిప్యూటీ చైర్మెన్ పరిస్థితి ఇదే..!

నకిరేకల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నేతి విద్యాసాగర్ ఇప్పటివరకు రెండుసార్లు పార్టీ మారారు. నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ కోసం ఈ తీవ్ర ప్రయత్నాలు చేసి టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్‌గా ఎమ్మెల్యేగా గతంలో పోటీ చేసి ఓడిపోయారు. 2004లో ఆ నియోజకవర్గం ఎస్సీ రిజర్వు కాగా అప్పటి వరకు కాంగ్రెస్ లోనే కొనసాగారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున వేముల వీరేశం గెలుపొందారు. అప్పటివరకు కాంగ్రెస్‌లో ఉన్న నేతి విద్యాసాగర్ టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ అయి శాసనమండలి డిప్యూటీ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. 9ఏండ్లు టీఆర్ఎస్‌లో ఉన్న నేతి విద్యాసాగర్ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని భావించి అసెంబ్లీ ఎన్నికలకు ముందే తిరిగి కాంగ్రెస్ లో చేరారు.

> నాయకుల పార్టీలు వేరైనా పవరే ప్రాణంగా కండువాలు మారుస్తూ రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి పవర్ రాజకీయం చేయడం నాయకులకు అలవాటుగా మారింది. సిద్ధాంతాలు, విలువలు లేకుండా పూటకో పార్టీ మారి ఓటర్లను ఆశ్చర్యపరుస్తున్నారు. అన్ని పార్టీలు ఫిరాయింపులకు ప్రాధాన్యత ఇస్తుండడంతో నాయకులు కూడా పవరే ఆక్సిజన్ గా పార్టీలు మారుతున్నారు. ఏ క్షణంలో ఎవరు పార్టీ మారుతారో అర్థంకాని పరిస్థితిలో రాజకీయాల్లో కనిపిస్తున్నాయి.

మొన్నటి వరకు నల్గొండ ఎంపీ టికెట్ ఆశించిన నేతి విద్యాసాగర్ ఇప్పుడు భువనగిరి ఎంపీ టికెట్ అడుగుతున్నారు. నకరికల్ లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్యేగా గెలుపొందగా రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలో రావడంతో నియోజవర్గ అభివృద్ధి కోసం పేరిట చిరుమర్తి లింగయ్య అప్పటి అధికార టిఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు. చిరుమర్తి లింగయ్య చేతిలో ఓడిపోయిన వేముల వీరేశం 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి టిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారు. చివరికి టికెట్ రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరే టికెట్ తెచ్చుకొని ఎమ్మెల్యేగా గెలుపొందారు. వీళ్ళు ఇద్దరు కూడ అధికారంలో ఉన్న పార్టీలోకి మారుతూ వచ్చారు.

అధికారం కోసమే పార్టీలు మారిన రాజగోపాల్ రెడ్డి

అధికారం కోసమే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రెండుసార్లు పార్టీ మారారు. 2009లో భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ తరపున గెలుపొందిన రాజగోపాల్ రెడ్డి 2014లో మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2018లో తిరిగి మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కానీ రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీలో చేరేందుకు చివరి వరకు ప్రయత్నాలు చేశారు. అప్పటి జిల్లా మంత్రి జగదీశ్ రెడ్డి వ్యతిరేకించడంతో కోమటిరెడ్డి బ్రదర్స్ చేరిక కాలేకపోయింది. దీంతో ఆ మంత్రిపై రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెంచుకున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలహీన పడుతుందని భావించి 2021 ఎమ్మెల్యేగా రాజీనామా చేసి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలో చేరారు. ఉప ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. 2023 నాటికి కాంగ్రెస్ మళ్లీ రాష్ట్రంలో పుంజుకోవడంతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని భావించి అసెంబ్లీ ఎన్నికల నాటికి తిరిగి ఆ పార్టీలో చేరి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకుని గెలుపొందారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. తన భార్య లక్ష్మి భువనగిరి ఎంపీ టికెట్ ఇప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

కబ్జా భూముల కోసమే గులాబీ పార్టీలో చేరిన సైదిరెడ్డి

కెనడాలో వ్యాపారం చేసుకుంటూ జీవన సాగించే సైదిరెడ్డి జిల్లా మంత్రి ఆ దేశ పర్యటన సందర్భంగా పరిచయం కావడంతో రాజకీయ అరంగ్రేటం చేశారు. 2018లో హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీఆర్ఎస్ తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తంకుమార్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఆ వెంటనే 2019లో వచ్చిన పార్లమెంటు ఎన్నికల్లో ఉత్తంకుమార్ రెడ్డి నల్గొండ ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. దీంతో ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా వచ్చిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా సైదిరెడ్డి మళ్లీ పోటీ చేసి ఎమ్మెల్యే గా గెలుపొందారు. ఆయన హయాంలో మఠంపల్లి మండలం గుర్రంబోడులో 1870 ఎకరాల గిరిజనుల భూములను ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఉత్తంకుమార్ రెడ్డి మంత్రిగా ఉండడంతో తమ అవినీతి బయటపడుతుందని ఉద్దేశంతో ఎవరికి చెప్పకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీలో చేరి నల్గొండ ఎంపీ బీజేపీ అభ్యర్థిగా టికెట్ తెచ్చుకున్నారు. తాను గెలిచినా, ఓడినా కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశతో ఆ పార్టీలో చేరినట్లు సమాచారం.

కండువా మార్చేందుకు సిద్ధమైన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు

ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు గులాబీ పార్టీ గుడ్ బాయ్ చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్టు సమాచారం. నల్గొండ పార్లమెంటు పరిధిలోని ఓ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి అనుచరుగా ఉండడంతో పాటు టీఆర్ఎస్ హయంలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018లో కూడా టీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పుడు రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో ఎలాంటి సమస్య రాలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే ఓడిపోవడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తిరిగి ఆ పార్టీలో చేరేందుకు సనద్ధమవుతున్నట్టు సమాచారం. ఇతనితో పాటు ఈ నియోజకవర్గంలోని ఒక ప్రధాన ప్రజాప్రతినిధితో పాటు మరి కొంతమంది ప్రజాప్రతినిధులు గులాబీ పార్టీని వీడి మాతృ పార్టీ అయిన కాంగ్రెస్‌లో చేరేందుకు కొన్ని నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వీరు గతంలో కాంగ్రెస్ పార్టీని వీడి అధికారంలో ఉన్న టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో ఈ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. వీరి రాకను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అదేవిధంగా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని ఓ మాజీ ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఇస్తామన్నా పోటీ చేసేందుకు ముందుకు రావడం లేదు. అతనే కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి పోటీ చేస్తే గెలుస్తామని ఆశతో ఆ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. కాగా కాంగ్రెస్ నాయకత్వం కూడా ఆ దిశగా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

మూడు నెలల్లో అర్బన్ హెల్త్ సెంటర్ కేంద్రం పూర్తి

- అదనంగా రూ.50 లక్షలు కేటాయింపు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



మూడు నెలల్లో మాన్యం చెల్క పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్ కేంద్ర నిర్మాణాన్ని పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చెల్క లో నైజకోటి 43 లక్షల తో నిర్మించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అన్ని హంగులతో నిర్మిస్తామని, ఏసీ సౌకర్యాన్ని కల్పిస్తామని, అదనంగా మరో రూ.50లక్షలు కేటాస్తామని తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా దత్తత తీసుకొని మరిన్ని సేవలు అందించేలా చూస్తామన్నారు. అనంతరం సాగర్ రోడ్‌లో రూ.11 కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

చెత్తను రీసైక్లింగ్ చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు

చెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందడంతోపాటు, భూమి, నీటి, వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం నల్గొండ కలెక్టరేట్లోని ఉదయాదిత్య భవన్లో WOW ITC, MAARI నల్గొండ మున్సిపాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో చెత్తను వేరు చేసే పద్ధతులు, ఆదాయాన్ని సంపాదించే పద్ధతులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నల్గొండ మున్సిపాలిటీలో కార్యక్రమాన్ని మొదలు పెడుతున్నందుకు ఐటిసి ప్రతినిధును అభినందించారు. అనంతరం పోస్టర్‌ను కలెక్టర్ హరిచందన తో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ దాసరి మాట్లాడుతూ రీసైక్లింగ్ చేయడం వల్ల కలిగే ఉపయోగాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్, నల్గొండ ఆర్డీవో రవి, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, ఐటిసి ప్రతినిధి ఉమాకాంత్, నల్గొండ జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మండల నాయకులతో పాటు, అధికారులు మున్సిపల్ రీసెర్చ్ పర్సన్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో సానుకూలత ఉంది

- కాంగ్రెస్‌లో అమిత్ రెడ్డి చేరికకు గతంలో ప్రతిపాదన వచ్చిన మాట వాస్తవం
- మాజీ ఎమ్మెల్యేల తీరుతో అమిత్ నిర్ణయం మార్చుకున్నాడు
- మీడియాతో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నవతెలంగాణ-నల్గొండటౌన్



కాంగ్రెస్ 100 రోజుల పాలన పట్ల ప్రజల్లో సానుకూలత ఉందని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలోమీడియాతో ఏర్పాటు చేసిన చిట్ చాట్ కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో రకరకాల ఊహాగానాలు రావడం సాధారణం అన్నారు.వివిధ కారణాల రీత్యా మా తనయుడు అమిత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ నుండి వెనక్కి తగ్గారని తెలిపారు. స్థానిక పరిస్థితులు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల తీరుతో నిర్ణయం మార్చుకున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేంద్రంగా పార్టీని నడపడం నిర్మాణం లోపాల వల్లే నేతలు పార్టీ వీడుతున్నారనే చర్చ నడుస్తోందని తెలిపారు. కాంగ్రెస్ లో అమిత్ రెడ్డి చేరికకు గతంలో ప్రతిపాదన వచ్చిన మాట వాస్తవం అన్నారు. కానీ ఆ తరువాత ఎటువంటి చర్చ లేదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డి మా సమీప బంధువని ఆయనతో మా తనయుడు అమిత్ భేటీలో రాజకీయ అంశాలు చర్చకు రాలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ 100 రోజుల పాలన విషయంలో ప్రజల్లో సానుకూలత ఉందన్నారు. ప్రజల అభిప్రాయమే తన అభిప్రాయమని తెలిపారు

వికలాంగులకు ఉచిత బస్సు పాసులు

నవతెలంగాణ-మిర్యాలగూడ

లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ చైతన్య జనసేవా సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ పరిసర ప్రాంత వికలాంగులకు శుక్రవారం ఉచిత బస్సు పాసులుచార్టర్ ప్రెసిడెంట్ కోల సైదులు ముదిరాజ్ అందజేశారు. సుమారు 100 మందికి పాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్, సోమయ్య, క్లబ్బు చార్టర్ కోశాధికారి జాటోత్ శంకర్ నాయక్, సింగు సైదులు, సింగు రాంబాబు, గంధం ఓం ప్రకాశం, ఎండి జానీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షునిగా శ్రీనివాస్

నవతెలంగాణ-మర్రిగూడ



కాంగ్రెస్ మండల నూతన అధ్యక్షులు గా మండలంలోని ఎరగండ్లపల్లి గ్రామానికి చెందిన రాందాస్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు.శుక్రవారము మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మేతరి యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య,జమ్ముల వెంకటేష్,ఎన్నమనేని రవీందర్రావు,సిరిపంగి శ్రీనివాస్, జైపాల్ రెడ్డి,మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాంపల్లి మండలాధ్యక్షునిగా రవీందర్ రెడ్డి

నాంపల్లి : కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన కత్తి రవీందర్ రెడ్డిని ఎన్నుకున్నారు. శుక్రవారం మును గోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నియామక పత్రాన్ని రవీందర్ రెడ్డి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘనంగా కాన్షిరామ్ జయంతి

వతెలంగాణ-చింతపల్లి

మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాన్షిరామ్ జయంతిని బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఎస్పీ అధ్యక్షులు ముదిగొండ మొగులయ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లాలు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ,ఎంఈఓను సస్పెండ్ చేయాలి :ఎస్ఎఫ్ఐ



నవతెలంగాణ-దేవరకొండ

గిరిజన విద్యార్థుల జీవితాలతో కలగాటమాడుతున్న ఉపాధ్యాయులను ఎంఈఓను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆకారం నరేష్ ,ఖమ్మం పాటి శంకర్ డిమాండ్ చేశారు. ఆ సంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చందంపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాల సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తేల్దేవరపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బాపన్ మోట్ తండా, జగన్ నాయక్ తండాలో 16మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఇక్కడ పని చేయాల్సిన ప్రధానోపాధ్యాయుడు జీతాలు చేసే నెల చివరి రెండు మూడు రోజుల్లో మాత్రమే వచ్చి సంతకాలు పెట్టుకొని పోతున్నారన్నారు. ఒక వాలంటరీని పెట్టుకుని విద్యార్థులకు సరైన విద్యాబోధన అందించకుండా కాంప్లెక్స్ హెడ్మాస్టర్, చందంపేట మండలం ఎంఈఓలను చేతిలో పెట్టుకొని పాఠశాలలకు రాకుండా మేనేజ్ చేసుకుంటున్న బాపట్ మెట్ ,జగన్ తండాలో ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేయాలనిడిమాండ్ చేశారు. అక్రమ డిప్యూటేషన్లతో గుడి తండలో పాఠశాల మూసివేతకు కారణమైన ఎంఈఓ పై చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే నల్గొండ జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి వీరి పైన సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్ నాయక్, బుడిగ వేంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దోచుకొని దాచుకున్న సొమ్మును కక్కిస్తాం

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-చింతపల్లి



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దోచుకొని దాచుకున్న సొమ్మును కక్కిస్తామని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం చింతపల్లి మండలంలోని కురుమేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన చేసిన శ్రీ లక్ష్మి శ్రీనివాస ఫంక్షన్ హాల్ ప్రారంభించి మాట్లాడారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ నేడు అప్పుల తెలంగాణ గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దొంతం సంజీవరెడ్డి, మండల అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణ్, శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఫంక్షన్ హాల్ యజమాని శ్రీనివాస్, బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గాదరి జంగయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కమిటీ నాయకులు కురుమేటి వెంకటరమణ, ముదిరాజ్ సంఘం యువజన మండలాధ్యక్షులు పాలమోని చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు రాటకొండ నరేంద్ర ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు

మహిళల భాగస్వామ్యంతోనే సంపూర్ణ అభివృద్ధి

నవతెలంగాణ- నార్కట్‌పల్లి



మహిళల భాగస్వామ్యంతోనే సంపూర్ణ అభివృద్ధి జరుగుతుందని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి పేర్కొన్నారు. శుక్రవారం ఎంజీయూలో ఇంటర్నల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి ఆయనతోపాటు ఓఎస్‌డి ఆచార్య కొప్పుల అంజిరెడ్డి గ్రామ్య రిసోర్స్ సెంటర్ డైరెక్టర్ సుమలత సఖి సెంటర్ ప్రతినిధులు హాజరై మహిళా హక్కుల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరతరాలుగా మహిళలు సామాజిక కట్టుబాట్లకు హింసకు దోపిడీకి బలవుతూ క్రమంగా అభివృద్ధి పదంలో సాగుతున్నప్పటికీ మరింత ఫలవంతమైన అభివృద్ధి మార్పు జరగాలంటే అన్ని రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరగాలని అన్నారు. ఇంటర్నల్ కమిటీ చైర్ పర్సన్ ఆచార్య బి సరిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ్య రిసోర్స్ సెంటర్ సంచాలకులు సుమలత , సఖి సెంటర్ ప్రతినిధులు సునీత, దివ్య, నాగమణి, ప్రిన్సిపాల్ డా మారం వెంకటరమణారెడ్డి, డా ప్రేమ్ సాగర్, డా దోమల రమేష్, అధ్యాపకులు డా కళ్యాణి, డా వై ప్రశాంతి , డా రామచందర్ పాల్గొన్నారు.

యాదయ్య వర్ధంతి

నవతెలంగాన-చిట్యాలటౌన్



మండలంలోని వెలిమినేడు గ్రామంలో శుక్రవారం సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నాతి యాదయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆ పార్టీ కార్యాలయం నుండి ఆయన స్తూపం వరకు ర్యాలీగా వెళ్లి పూలమాలవేసి నివాళులర్పించారు.. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు మల్లం మహేష్ మాట్లాడుతూ నాతి యాదయ్య చిన్నప్పటినుండి పార్టీలో చురుగ్గా పనిచేస్తూ ప్రజా కళాకారుడిగా పాటలు పాడుతూ ప్రజలను చైతన్యంచేశారన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నాతి నర్సమ్మ ,నాతి సుందరయ్య ,ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు నెలికంటి నరసింహ, సుర్కంటి రాంరెడ్డి ,ఆరూరి శంబయ్య, గ్రామ కార్యదర్శి పంది నరేష్, కందటి యాదిరెడ్డి ,ఆరూరి దుర్గయ్య, ఆరూరి నరసింహ, గడ్డం నర్సిరెడ్డి, మంకాల ముత్యాలు, గోలి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు..



ఆర్డీవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ ఆర్డీవోగా గూడూరి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాసరావు బదిలీపై ఆర్డీవోగా మిర్యాలగూడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఆర్డీవో చెన్నయ్య జగిత్యాల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా(ల్యాండ్ అక్వేషన్స్) బదిలీపై వెళ్లారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట
2
శనివారం | మార్చి 16. 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-మునగాల



మండలపరిధిలోని ముకుందాపురం ఎస్సీ కాలనీ వద్ద 65వజాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు.ఎస్సై అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(55) మునగాల మండలం ముకుందాపురంలో క్రిమిసంహారక మందులు కొనేందుకు బైక్‌పై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఎస్సీకాలనీ వద్ద జాతీయ రహదారి దాటు తుండగా విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ఆయన్ను 108 వాహనం ద్వారా కోదాడ తరలి స్తుండగా మార్గమధ్యలో ఆకుపాముల వద్ద మృతి చెందాడు. మృతునికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

27 నుండి లక్ష్మీనర్సింహాస్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-చివ్వెంల

ఈనెల 27 నుంచి మూడు రోజులపాటు జరగనున్న శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షులు చకిలంకృష్ణకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉండ్రుగొండ గుట్టలో వెలిసిన లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.శ్రీమాన్ ఆరుట్ల రవికుమారాచార్యులు, అరవిందాచార్యులు, ఆలయఅర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో త్రయాహిక దీక్షతో అత్యంత వైభవంగా జరగనుందన్నారు.ఈనెల 27,28,29వ తేదీల్లో జరగనున్న బ్రహ్మోత్సవాలకు ఉమ్మడిజిల్లాల నుంచి కాకుండా ఇతర జిల్లాల భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బంధకవి కృష్ణమోహన్, యలగబోయిన శ్రీరాములు, కైరోజు శంకరాచారి,నరసయ్య,గుండా శ్రీనివాస్,శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

నవతెలంగాణ-మోతె

మండలవ్యాప్తంగా నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదు చేయాలని భవననిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూఅనుబంధం) మోతె మండల అధ్యక్షులు ఒగ్గు సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ప్రతి కార్మికుడికి గత ప్రభుత్వం హామీ మేరకు మోటార్ సైకిల్ ఇవ్వాలని, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.వెల్ఫేర్ బోర్డులో నమోదైన ప్రతి కార్మికుడికి పనిముట్ల కొనుగోలుకు ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు.వెల్ఫేర్‌బోర్డులో ఉన్న నిధులను కార్మికుల ప్రయోజనాల కోసమే ఖర్చు చేయాలని కోరారు. ప్రమాదంలో చనిపోయిన భవననిర్మాణ కార్మికుల కుటుంబానికి ప్రభుత్వం 10 రూ.10లక్షలివ్వాలని కోరారు.

'బాలింతలకు చిరుధాన్యాలే పోషకాహారం'

నవతెలంగాణ-నాగారం

చిరుధాన్యాలలోనే బాలింతలకు పోషకాహారాలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజరు అనురాధ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని పస్తాల గ్రామంలో అంగన్వాడీకేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె బాలింతలకు ,గర్భిణులకు, పిల్లలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు.చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల పిల్లల్లో రక్తహీనతను నివారించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో పల్లెదవాఖాన వైద్యులు శ్రవణ్ కుమార్,ఏఎన్ఎం లక్ష్మీబాయి, అంగన్వాడీ టీచర్స్ మంజుల,కవిత పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్‌లో మొదటి సారీ ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవలని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కె.జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రతిపాదికన ఉంటుందని తెలిపారు.యూపీఎస్‌సీ-సీఎస్‌ఏటీ-2025 సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలలో సాధారణ, ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థుల ద్వారా www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మృతి

నవతెలంగాణ-తుంగతుర్తి

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మృతిచెందగా అతడి భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని బండరామారం స్టేజి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..



నాగారం మండలపరిధిలోని పసునూరు గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గుమ్మడవెల్లి జనార్దన్(65) తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై తుంగతుర్తికి వచ్చి తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా బండరామారం స్టేజి వద్ద ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది.దీంతో బైక్‌పై ఉన్న గుమ్మడవెల్లి జనార్ధన్ దంపతులు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి.ఈ మేరకు వారిని సూర్యాపేటకు తరలించి చికిత్స చేస్తుండగా జనార్ధన్ మృతి చెందారు.అతని భార్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.12 లక్షలతో వ్యక్తి పరార్

- కేసు నమోదు

నవతెలంగాణ-కోదాడరూరల్



పట్టణ పోలీస్‌స్టేషన్ స్థలంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తున్న వ్యక్తి రూ.12 లక్షలతో ఉడాయించడంతో అతనిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణ పోలీసుస్టేషన్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారుబంక్‌లో అనంతగిరి మండలం మొగలాయికోటకు చెందిన వాచేపల్లి హనుమారెడ్డి మేనేజర్‌గా పని చేస్తున్నాడు.బంక్‌లో పెట్రోల్ అమ్మగా వచ్చిన డబ్బులు అతడే బ్యాంకులో జమ చేసేవాడు.ఈ నేపథ్యంలో రెండు రోజులుగా అతడు బంక్‌కు రాకపోవడంతో పాటు బ్యాంక్‌లో జమ చేయాల్సిన రూ.12 లక్షల నగదును జమ చేయలేదు. దీనితో పోలీసులు అతడి ఆచూకీ కోసం ప్రయత్నించగా ప్రయోజనం లేకపోయింది. దీనితో బంక్‌లో పని చేసే ఇతర సిబ్బంది ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓటరు అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మెన్ నీలా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓటరు అవగాహనా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.యువత చైతన్యమై మంచి నాయకుడికి ఓటేసి గెలిపించుకోవాలని సూచించారు.ముందుగా కిట్స్ కళాశాల విద్యార్థినులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ సలీం షరీఫ్, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్, రమేశ్, ప్రిన్సిపాల్ గాంధీ, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, పోతుగంటి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు,పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-హుజూర్‌నగర్

పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంప్ పాఠశాలలు పదవ తరగతి విద్యార్థులకు జన చైతన్య ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్యాడ్లు, పెన్నులు ,పెన్సిళ్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు విద్య నేర్పిన గురువులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్‌లో ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పదవ తరగతిలో 9.8 జీపీఏ మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున బహుమతి ఇస్తానని తేలుకుంట శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆ ట్రస్టు చైర్మెన్ పినపరాల వంశీ, సభ్యులు పారా సాయిశంకర్, కాశీ విశ్వనాథం, భవిత పాఠశాల హెచ్‌ఎం రాధాకుమారి,రాజేష్, గంజి శివ, రాంబాబు, దగ్గుబాటిరాజేశ్, ప్రధానోపాధ్యాయుడు బీరెల్లిశ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు వేములశ్రీనివాస్, సైదులు, వెంకటేశ్వర్లు ,పతంజలి శాస్త్రి, సైదా, షమీ, భవిత తదితరులు పాల్గొన్నారు.



పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్



వర్షాభావ పరిస్థితుల మూలంగా వరిపంట ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు.శుక్రవారం ఆ సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద, ఎస్సారెస్పీ ప్రాజెక్టు కింద వరి సాగు చేసిన పొలాలకు నీరందక ఎండిపోతున్నాయన్నారు.తీవ్ర వర్షాభావ పరిస్థితుల మూలంగా భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు ఎండిపోవడంతో నీళ్ల రాక సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నాగార్జునసాగర్ ఆయకట్టు, ఎస్సారెస్పీ ప్రాజెక్టు కింద రైతులు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి బోర్లు బావులు తీసుకున్న నీళ్ల రాక వేసిన వరి పంట ఎండిపోయాయన్నారు. రైతులు ఎకరానికి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశారన్నారు.తీరా పంట చేతికొచ్చే సమయంలో నీళ్ల లేక ఎండిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా తీరే పరిస్థితి లేకపోవడంతో ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి దాపురించిందని తెలిపారు.వెంటనే వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఎండిపోయిన పంటలను పరిశీలించి ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.. ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొప్పులరజిత, జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకట్‌రెడ్డి,కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ సైదా, రైతుసంఘం జిల్లా నాయకులు మందడి రాంరెడ్డి, బెల్లంకొండ సత్యనారాయణ,ఏనుగుల వీరాంజనేయులు,కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, పట్నం జిల్లా కార్యదర్శి జిల్లేపల్లి నర్సింహారావు, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి వీరబోయిన రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధనియాకుల శ్రీకాంత్,వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుంజ వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా నాయకులు రణపంగ కృష్ణ, నాగటి చిన్న రాములు, ప్రజాసంఘాల నాయకులు కోడిఎల్లయ్య, కిన్నెర వెంకన్న పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు.శుక్రవారం కలెక్టర్ వెబెక్స్ ద్వారా డీఆర్‌డీఏ, డీఈఓ, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎంఈఓలు, ఏపీఎంలు, ఇంజనీరింగ్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పాఠశాలలో కమిటీల పర్యవేక్షణలో పలు అభివృద్ధి పనులు జరగనున్నాయన్నారు.దీనికి గాను ప్రభుత్వం గ్రామాలలో గ్రామ సమాఖ్య, పట్టణాలలో ఏరియా సమాఖ్య అధ్యక్షురాలు ఈ కమిటీలకు అధ్యక్షురాలుగా వ్యవహరిస్తారన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు.ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు.ఈ కమిటీల పదవి కాలం రెండేండ్లుగా ఉంటుందన్నారు. పాఠశాలలో అన్ని మౌలికవసతుల కల్పనకు, విద్యను మెరుగుపర్చడానికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమం చేపట్టిందన్నారు.ఈ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పాఠశాల పర్యవేక్షణ తాగునీటి సౌకర్యాలు,విద్యార్థులకు మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుద్దీకరణ, పారిశుధ్యం, విద్యార్థులకు యూనిఫామ్ కుట్టు వంటి పనులను ఈ కమిటీలు చేస్తాయన్నారు.జిల్లాలో 584 పాఠశాలో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల పర్యవేక్షణలో జూన్‌కల్లా పాఠశాలలో అన్ని మౌలిక వసతులు,పనులను పూర్తి చేయాలని తెలిపారు.ఈనెల 18 నుండి ప్రారంభంకానున్న టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు..ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల వద్ద 25,000 అత్యవసర నిధులు వినియోగించుకోవచ్చని, పాఠశాలలో చేపట్టిన పనులకు రూ.లక్ష వరకు ఎంపీడీఓలు చెల్లించొచ్చన్నారు.జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని, 3 రోజులలో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పశువుల కొరకు నీటితొట్లు ఏర్పాటు చేసి నీరు నింపాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

గాలికుంటు నివారణా టీకాలను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కుమారస్వామి

నవతెలంగాణ-చిలుకూరు



పశువులకు ఉచిత గాలికుంటు నివారణా టీకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కుమారస్వామి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో జరిగిన సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు.ఈనెల 18వ తేదీ నుండి ఏప్రిల్ 14వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఉచితంగా గాలికుంటూ టీకాలు చేస్తున్నందున ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కొంతమంది రైతులు మండలకేంద్రంలోని కొత్త చిలుకూరులో ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడే పశువులకు టీకాలు అందించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ పెంటయ్య, చిలుకూరు పశు వైద్యాధికారి వీరారెడ్డి, మాజీ డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరినర్సయ్య, నెల్లూరు నాగేశ్వర్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



శాసనసభ స్పీకర్, మంత్రులను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పాలకవీడు

రూ.33.83 కోట్లతో నిర్మించనున్న పాలకవీడు మండలం బెట్టేతండా ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన,శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు కెప్టెన్ నలమద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను కాంగ్రెస్ మండల నాయకులు జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో సచివాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు.స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు జ్ఞాపికలు అందజేశారు. మారుమూల గిరిజన ప్రాంతానికి విచ్చేసి రైతుల చిరకాలవాంఛ నెరవేర్చిన వారికి మండలప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా గోపాల్‌నాయక్, కాంగ్రెస్ లీడర్ మోతిలాల్‌నాయక్, పాలకవీడు, నేరేడుచర్ల మండలాల అధ్యక్షులు ఎస్‌వీ.సుబ్బారావు, కొణతం చినవెంకట్‌రెడ్డి, నేరేడుచర్ల పట్టణ కౌన్సిలర్ బైరెడ్డి జితేందర్‌రెడ్డి,నాయకులు నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్‌వెలుగులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం'

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

గ్రామాలలోని ప్రజలకు విద్యుత్ వెలుగులు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని బూరుగడ్డ గ్రామంలో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహాయ సహకారాలతో హుజూర్‌నగర్ మండలాన్ని అన్ని రంగాలల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ రాంప్రసాద్‌గౌడ్, బూరుగడ్డ, మాచవరం గ్రామశాఖ అధ్యక్షులు ఎరగాని భిక్షం, గడ్డంనాగయ్య, కాంగ్రెస్ గ్రామ నాయకులు, ఎరగాని నర్సింహారావు, బత్తిని వీరబాబు, ఎరగాని సైదులు, కట్టెబోయిన గోవిందు, రాగం నాగయ్య, చిమట సైదులు, మేకపోతులనర్సింహారావు, పెండెం మట్టపల్లి, ప్రార్థనబోయిన మల్లయ్య, ప్రార్థనబోయినగంగయ్య, కందుకూరి నర్సింహారావు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-హుజూర్‌నగర్



మున్సిపల్‌పరిధిలోని పలు వార్డులలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్‌చైర్మెన్ కోతి సంపత్‌రెడ్డితో కలిసి పలు వార్డుల కౌన్సిలర్లు ఆయా అవార్డులలో రోడ్లు, డ్రైన్లకు శుక్రవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి సహకారంతో హుజూర్‌నగర్ పట్టణంలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.త్వరలో పట్టణంలో నెలకొన్న సమస్యలన్ని దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కొమ్ము శ్రీను, జక్కులశంభయ్య, ఓరుగంటి నాగేశ్వరరావు ,దొంగరి మంగమ్మ, ములకలపల్లి రాంగోపి, వేముల నాగరాజు, బొల్లెద్దు ధనమ్మ,ఫణికుమారి, సరిత,రాజానాయక్, త్రివేణి,కేఎల్ఎన్‌రావు. విజయలక్ష్మీ, ఉపేంద్ర, సైదులు, అట్లూరి మంజుల, దొంతగానిపద్మ,గాయత్రి భాస్కర్,అమరబోయిన సతీష్, గంగరాజు, ఎరగాని గురువయ్య పాల్గొన్నారు.

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం పుణ్యకార్యం

నవతెలంగాణ-కోదాడరూరల్

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం పుణ్యకార్యమని పట్టణ సీఐ రాము అన్నారు.శుక్రవారం పట్టణంలోని రంగా థియేటర్ ముందు నాగుబండి రామ్మూర్తి జ్ఞాపకార్థం వారి కుమారుడు ట్రస్టు గౌరవ అధ్యక్షులు నాగుబండి రంగా, స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హైటెక్ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.ఐదేండ్లుగా స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు గాదంశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి ఇరుకుళ్ల చెన్నకేశవరావు, వైస్ ప్రెసిడెంట్ ఓరుగంటి కిట్టు, జాయింట్ సెక్రెటరీ యాదసుధాకర్,సాంబశివరావు, రాయపూడివెంకటనారాయణ, సాయి, పైడిమర్రి రామారావు, పందిరి సత్యనారాయణ, వెంపటిప్రసాద్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

నవతెలంగాణ-కోదాడరూరల్

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల మున్నూరు కాపు కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో పట్టణ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, డీసీసీ ఉపాధ్యక్షులు పారా సీతయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వానికి ఎల్లవేళలా రుణపడి ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో చింతలపాటి శ్రీనివాస్, కోదాడ పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సన్నీరు. మురళి,ఎలగందుల. నరసయ్య,చింతలపాటి శేఖర్, వెంకట్రావు, కంబాల ప్రసాద్, పొనుగోటి సైదులు, భీమిశెట్టి వెంకన్న, వేనేపల్లి వీరబాబు,కందికొండ వీరబాబు, కాసర్ల శ్రీను, చౌడం హనుమంతరావు, నామా నరసింహారావు, కోటేశ్వరరావు, బుచ్చిబాబు, నవీన్, కొండల్,ఆవుల గోపి, ఆవుల శ్రీను, నరేష్, పవన్, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చట్టసభల్లో బీసీవాటా కోసం బీసీలు ఐక్యం కావాలి

నవతెలంగాణ-నాగారం

చట్టసభల్లో బీసీ వాటా సాధన కోసం బీసీలంతా ఐక్యం కావాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్, ఓబీసీ బ్లాక్‌చైర్మెన్ సాయినినరేందర్ పిలుపునిచ్చారు.చట్టసభల్లో బీసీ వాటా సాధన కోసం చేపట్టిన మొదటిదశ పాదయాత్ర శుక్రవారం మండలపరిధిలోని ఫణిగిరి, ఈటూరు గ్రామాలలో చేసి మాట్లాడారు. స్వాతంత్ర్యం ముందు దేశం కోసం అనేక త్యాగాలు చేసిన బీసీలకు రాజ్యాంగ హక్కులు లేక ,బతకలేక బలిదానాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.ఈనెల 20న సర్దార్ సర్వాయి పాపన్న ఉద్యమఖిల్లా ఖిలాసపూర్‌లో జరిగే బీసీ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ బీసీలంతా ఏకమై విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీసంఘం నాయకులు ఎర్ర శ్రీహరిగౌడ్, గిరగాని సతీష్‌గౌడ్,చాపర్తికుమార్,బాలస్వామి, వెంకట స్వామిగౌడ్, కొంగర సుజాత,చెన్నుశ్రవణ్‌కుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తుంగతుర్తి

గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి నరేష్,డాక్టర్ మమత కోరారు.శుక్రవారం మండలపరిధిలోని అన్నారం గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.గ్రామంలో మొత్తం 78 పశువులకు టీకాలేశామన్నారు.ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ శ్రీను,గోపాలమిత్ర కుంచాల శ్రీనివాస్‌రెడ్డి,లింగయ్య, రైతులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ :మండలపరిధిలోని అనంతారం గ్రామంలో మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి యర్రంశెట్టి కిరణ్ గాలికుంటు వ్యాధి నివారణా టీకాలేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.పాడిరైతులకు నట్టల మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి,జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ స్వరూప్, ఓఎస్ జుబేద్‌ఖాన్, వెంకన్న, నగేష్ పాల్గొన్నారు.

'కేంద్రంలో బీజేపీ రావడం ఖాయం'

నవతెలంగాణ-తిరుమలగిరి

కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని ఆ పార్టీ సూర్యాపేట జిల్లా నాయకులు ఎలిసోజు దీన్‌దయాల్ జోస్యం చెప్పారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.దేశంలో 140 కోట్ల జనాభాలో సుమారు 80 కోట్ల మందికి ఉచితరేషన్ అందిస్తున్న ఏకైక నాయ కుడు ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. దేశంలో 10 కోట్ల మంది మహిళలకు ఉచితంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్ అందిస్తున్నట్టు తెలిపారు. దేశంలో సుమారుగా 80 కోట్ల మంది ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలు మళ్లీ మోడీయే ప్రధాని కావాలని కోరుకుంటున్నారని తెలిపారు.

'కేంద్రం సీసీఏను వెనక్కు తీసుకోవాలి'

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్



వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం సీఏఏను వ్యతి రేకించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూరవెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని తెలంగాణలో అమలు చేయకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.మత-విభజన చట్టాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, రేగటి లింగయ్య, అనంతుల జానయ్య, ఐతరాజు లింగయ్య, రేగటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉపాధ్యాయులు మైలారపు వెంకన్న జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు భారతి, దివ్యలు పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామగ్రి ప్యాడ్లు, పెన్నులు, పరీక్షా సామగ్రి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షరీఫ్, ఉపేందర్, రామకృష్ణ, మెహబూబ్‌అలీ, విజయ, కరుణశ్రీ, మల్లీశ్వరి, సునీతాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-మోత్కూరు



మండలంలోని పాలడుగు, దత్తప్ప గూడెం, సదర్ షాపురం, గ్రామాలలో శుక్రవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, సీసీ రోడ్ల నిర్మాణ పనులు, పాఠశాలల ప్రహరీ గోడలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పల్లెర్ల భాస్కర్ మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ తీగల నరసింహారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్ కాంగ్రెస్ నాయకులు గొట్టే వెంకన్న,కనకయ్య,దొండ శ్రీశైలం,తీగల వినోద్, కొమ్మూరి నర్సిరెడ్డి,లక్ష్మారెడ్డి, దొండ లింగయ్య,కమ్మగాని శ్రీను,సుంకరి భూపాల్, తీగల యాదయ్య,తీగల వెంకటయ్య, దొండ మల్లయ్య, ప్రవీణ్, అశోక్, పరమేష్, మల్లేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



మండలంలోని ఎల్లంబావి ప్రగతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వారి యొక్క తల్లిదండ్రుల సహాయంతో, తయారుచేసిన విభిన్న రకాల రుచికరమైన ఆహార పదార్థాలను పాఠశాలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎస్డీ సయ్యద్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఎక్కువగా పోషక విలువలు, ప్రోటీన్లు, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు, మాంసకృతులు ఉన్నటువంటి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ సయ్యద్ షబ్బీర్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

మురళీకృష్ణునిగా లక్ష్మీనరసింహుడు



నవతెలంగాణ-యాదగిరిగుట్ట

యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామి వారు మురళీకృష్ణుని అలంకారంలో ఊరేగి భక్తులను అలరించాడు. అంతకుముందు ఆలయంలో నిత్య ఆరాధన అనంతరం మురళీకృష్ణగా నరసింహుడు భక్తులకు దర్శనమిచ్చాడు. సమస్త ప్రాణకోటిని తన వైపు ఆకర్షించుకుంటూ రమణీయమైన తన సౌందర్యాలను దర్శింపచేస్తూ ఎంతటి వారినైనా మొగ్గులను గావించు అపురూప తత్వమే శ్రీకృష్ణ అవతారం అని అర్చకులు తెలిపారు. సాయంత్రం పొన్న వాహనంపై లక్ష్మీనరసింహస్వామి ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. సంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం బ్రహ్మోత్సవాలు భాగంగా ప్రతి ఏడు నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాలను శుక్రవారం ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఉదయం హైదరాబాద్ చెందిన సాయిబాబా సేవసమితితో భజన, మసనప్పతో ఉపనిషత్ వైభవం ఉపన్యాసం, అనంతరం అల్లం కనకదుర్గ భగవతారితో భక్త ప్రహ్లాద హరికథ గానం నిర్వహించారు. సాయంత్రం రాధిక మ్యూజిక్ సౌండ్స్ ఆధ్వర్యంలో భక్త సంగీతం, తాడూరి రేణుకతో కూచిపూడి ప్రదర్శన జరిగింది. లిఅభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యేలి కొండపైన పలు అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. డార్మింటరి హల్ తో పాటు



వేసవికాలం సందర్భంగా నీడ నిమిత్తం షెడ్ నిర్మాణాన్ని కూడా ఆయన శంకుస్థాపన చేశారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎరుకల సుధా హేమేందర్ గౌడ్ ,ఎంపీపీ చీర శ్రీశైలం, జడ్పిటిసి తోటకూర అనురాధ ,ఈవో రామకృష్ణారావు ,అనువంశిక ధర్మకర్త బి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ను గెలిపించండి.. బీజేపీని ఓడించండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ .వీరయ్య పిలుపు

నవతెలంగాణ-భువనగిరి

రానున్న పార్లమెంటు సార్వత్రిక ఎన్నికలలో సీపీఐ(ఎం)ను గెలిపించి బీజేపీని ఓడించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజల దృష్టిని సమస్యల నుండి మరల్చడానికి మతం వైపు దేవుడి వైపు మోడీ తిప్పుతున్నాడని విమర్శించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని మోడీ ప్రధానమంత్రి గద్దె మీద కూర్చోవడానికి ఇక ఏమాత్రం అర్హత లేదన్నారు. తెలంగాణలో బీజేపీకి ఒక్క సీటు రాకుండా, ఓట్ల శాతం పెరగకుండా చూడాలన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు, రాజ్యాంగ విలువలు కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం లో సీపీఐ(ఎం) పోటీ చేస్తుందని తెలిపారు. త్వరలోనే అభ్యర్థిని ప్రకటిస్తామని వివరించారు. సీపీఐ(ఎం)కుప్రజలు ఓటు వేయాలని కోరారు. ప్రజాస్వామ్యవాదులు, లౌకిక శక్తులు, మేధావులు, ప్రజలు ఎర్రజెండాను ఆదరించాలని తమ అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు పాల్గొన్నారు.

వినియోగదారులు చట్టాలను ఉపయోగించుకోవాలి

- నష్టపోయినప్పుడు కన్స్యూమర్‌ఫోరంను ఆశ్రయించాలి
- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కే.మారుతీ దేవి

నవతెలంగాణ-భువనగిరి

వినియోగదారుల చట్టాలను ప్రజలు ఉపయోగించుకోవాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె. మారుతి దేవి అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం (మార్చి15) సందర్భంగా శుక్రవారం అవగాహన సదస్సును జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యదాద్రి భువనగిరి మరియు జిల్లా వినియోగదారుల సమన్వయ సంఘం సంయుక్త ఆధ్వర్యములో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యాక్రమములో మారుతి దేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కొనుగోలు రూపేనా వినియోగదారుడని, ఆహారం, అవసరాలు, వైద్యం ప్రతీ దాంట్లో నాణ్యతా లోపముతో ఆరోగ్య పరంగా, ఆర్థికపరంగా నష్టపోవటం జరుగుతుందన్నారు. వినియోగదారుడు కొనుగోలు చేసిన వస్తువుపై రశీదు పొందక న్యాయం పొందలేకపోతున్నారన్నారు. వ్యయసాయదారులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, పంటకు ఉపయోగించే రసాయనాలు వారిపై తప్పనిసరిగా రశీదు పొందవలెనని తద్వారా ఏదేని నాణ్యతా లోపముతో



నష్టపోయినప్పుడు కన్స్యూమర్ ఫోరంను ఆశ్రయించి తగిన నష్ట పరిహారాన్ని పొందవచ్చని తెలిపారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ కె. దశరథ రామయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం వినియోగదారుల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని వినియోగదారులకు నిస్పాక్షిక మరియు బాధ్యతాయుతమైన సేవలు అందచేయటం అనే థీమ్ ఎంచుకోవడమైనదన్నారు. వినియోగదారుల చట్టం ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకొని తమ దైనందిన జీవితములో పాటించి చట్టపరమైన హక్కుల ద్వారా న్యాయాన్ని పొందాలని తెలిపారు. భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగారం అంజయ్య మాట్లాడుతూ అనేక వ్యాపార ప్రకటనలతో వినియోగదారున్ని ఆకర్షించి సామాన్యున్ని ఆర్ధికంగా ఎంతో నష్టం కలిగేలా చేస్తుందని తెలిపి, న్యాయపరమైన చిక్కులకు సలహా కోసం ప్యానల్ న్యాయవాదులను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా వినియోగదారుల సమన్వయ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ మరియు కార్యదర్శి జంపాల అంజయ్యలు మాట్లాడుతూ వినియోగదారుడు చట్టాలపట్ల , తన హక్కులపట్ల అవగాహన పెంచుకోవటమే కాక వినియోగదారుడిగా తను నిర్వర్తించవలసిన బాధ్యతలను నిర్వర్తిస్తే వ్యాపారులలో మార్పు రావటమే కాక వస్తు నాణ్యత, చట్టాల అమలుపట్ల అప్రమత్తత చేకూరుతాయని తెలిపారు. కార్యాక్రమములో న్యాయవాదుల సంఘం కార్యదర్శి సి.హెచ్ రాజశేఖర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రెడ్డి, జి. రవీందర్ రెడ్డి, స్వామి, సత్యనారాయణ, ఎ.జి.పి.కేశవరెడ్డి, ప్రత్యేక ఎ.జి.పి.బాబూరావు, సీనియర్ న్యాయవాది పులిమామిడి బాల కృష్ణ రెడ్డి, న్యాయ సహాయ న్యాయవాదులు ఎస్వి.జైపాల్, జి. శంకర్, వివిధ మండల వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవుని బాబు, కె. శ్రీనివాస రావు, చంద్రశేఖర్, యాదగిరి, జి.పరశురాములు, వెంకటాచారి, ప్రజలు, కక్షిదారులు పాల్గొన్నారు.



ఓటు నమోదుపై అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ-భువనగిరి

రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో యువత వంద శాతం ఓటు నమోదు చేసేలా స్వీప్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి ఎం.ఎ.కృష్ణన్ క్యాంపస్ అంబాసిడర్లకు సూచించారు. విద్యార్థులను ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేసేలా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు క్యాంపస్ అబాసిడర్స్‌గా నియమితులైన ప్రిన్సిపల్స్, డిపిఎం, ఎపిఎం లకు శుక్రవారం కాన్ఫరెన్స్ హాలులో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి మాట్లాడుతూ..ఎన్నికల ప్రక్రియలో ప్రజలు ముఖ్యంగా యువత భాగస్వామ్యం కావాలన్నారు. ఎన్నికలలో జరిగే అక్రమాలపై 'సి' విజిల్ యాప్‌లో ఫిర్యాదులు చేయడం ద్వారా వంద నిమిషాలలో ఫిర్యాదులను పరిష్కరించడం జరుగుతుదన్నారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, వివిధ కాలేజీల ప్రిన్సిపాల్స్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, డిపిఎం, ఎపియంలు, అధికారులు పాల్గొన్నారు.



గ్రామాలభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

నవతెలంగాణ-వలిగొండరూరల్

గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి పరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సంగెం, గోకారం, జాలు కాలువ, నాగారం, వలిగొండ, పులిగిల్ల, మొగిలి పాక, వెలవర్తి గ్రామాలలో సుమారుగా 2 కోట్ల రూపాయల విలువతో నిర్మించనున్న సిసి రోడ్లకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తున్నారని, రైతుల సాగు నీటి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నూతి రమేష్, జెడ్పిటిసి వాకిటి పద్మ అనంతరెడ్డి, వైస్ ఎంపిపి బాతరాజు ఉమా బాల్ నర్సింహ, బెలిద సునీత నాగేశ్వర్, కుందారపు యధోదా కొమురయ్య, పల్లెర్ల బాగ్యమ్మ రాజు, ఎడవెల్లి సతమ్మ యాదయ్య, బండారు ఎల్లయ్య పాశం సత్తి రెడ్డి, గరిసే రవి, బద్దం సంజీవరెడ్డి, మామిడి సత్తిరెడ్డి, కీసరి రాంరెడ్డి, తీగల కిష్టయ్య, పలుసం సతీష్, పి ఆర్ ఏ సుగుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

నవతెలంగాణ-భువనగిరి

మార్చి 16 శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణంలో నిర్వహించబడుతుందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ జయరాజు, కార్యదర్శి అదనపు సివిల్ జడ్జ్ కే ద శరథ రామయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీకి ఆమోద యోగ్యము అన్ని కేసులను సివిల్ క్రిమినల్ కోర్టు ముందుకు రానటువంటి కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

మండల వ్యాప్తంగా వరిపంట వేసి నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, రైతు సంఘం నాయకులు పిక్క గణేష్ అన్నారు. ఆలేరు మండలం పటేల్ గూడెం గ్రామంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పటేల్ గూడెం, శ్రీనివాసపురం, గుండ్లగూడెం గ్రామాలతోపాటు మండల వ్యాప్తంగా దాదాపు 100 ఎకరాల వరకు వరి పంట ఎండిపోయే దశలో ఉన్నాయన్నారు. ఎండిన పంటలను వ్యవసాయ అధికారులచే పరిశీలన చేయించి పంట నష్టపరిహారం ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం అందించాలని కోరారు. నేరుగా రైతుల ఖాతాలలో వేసేలా చూడాలన్నారు.

శకుంతలదేవికి నివాళులు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

మోటకొండూరు మండలంలోని దిలావర్ పూర్ గ్రామంలో శుక్రవారం, ఆలేరు పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ గుత్తా శమంత రెడ్డి అత్త గుత్తా శంకుతాల దేవి దశదినకర్మకి హజరై, ఆమె చిత్ర పటానికి స్థానిక నాయకులతో కలిసి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్ గౌడ్ నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ది ప్రజావంచక పాలన'

నవతెలంగాణ-రాజపేట

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్నది ప్రజా పాలన కాదని, ప్రజా వంచక పాలన అని బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఆరు గ్యారంటీల అమలు చేయలేదన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ అరచేతిలో వైకుంఠం చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల టిఆర్ఎస్ సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్ నియోజకవర్గ టిఆర్ఎస్ యువజన నాయకులు కటకం స్వామి మోత్కుపల్లి నవీన్ రెడ్డబోయిన రాజు మండల టిఆర్ఎస్ యువజన నాయకులు మంత్రాల సుమన్ దేవనపల్లి గణేష్ చిగుళ్ల గణేష్ తుమ్మ ప్రశాంత్ కలకుంట్ల క్రాంతి కలకుంట్ల భాను తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలి

నవతెలంగాణ-భువనగిరి

వచ్చే మూడు సంవత్సరాలకు గాను హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటడానికి వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ షాలోమ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేటు కాన్ఫరెన్సు హాలులో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై వచ్చే 2024, 2025, 2026 మూడు సంవత్సరాలకు గాను హరితహారంలో మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు. రాబోయే జూన్, జూలై మాసాలలో వర్షాలకనుగుణంగా మొక్కలు నాటాలన్నారు. శాఖల వారి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ ఖాళీ భూములు, చెరువు కట్టలు, రోడ్ల వెంట, తదితర ప్రాంతాలలో మొక్కలు నాటాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా నర్సరీలలో అవసరమైన మొక్కల పెంపకం చేపట్టాలని తెలిపారు. ఈ



కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి పద్మజారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.ఎ. కృష్ణన్, జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ, జిల్లా పంచాయితీ అధికారి సునంద, జిల్లా ఉద్యానవన అధికారి అన్నపూర్ణ, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టరు, మున్సిపల్ కమీషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

మహిళలను వస్తువులా చూస్తున్నారు

- మాతృక పత్రిక సంపాదకులు రమా సుందరి



నవతెలంగాణ-భువనగిరి


భారతదేశంలో మహిళలను ఒక వస్తువు లాగా చూస్తున్నారని, మాతృక పత్రిక సంపాదకులు రమా సుందరి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో సామాజిక చైతన్య సమితి ఆధ్వర్యంలో, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సమావేశానికి రమాసుందరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళల మీద అణిచివేత సైలెంట్ వార్‌లాగా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల పెంపకంలోనే లోపం ఉందని, ఆడపిల్లలను, మగ పిల్లలను సమాన దృష్టితో చూడకపోవటమే ఇందుకు కారణమన్నారు. అలాగే నవభారత్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ చిక్క ప్రభాకర్ గౌడ్, ఉపాధ్యాయుని అనిత అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏవిధంగా ఏర్పడింది అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయురాలు అనిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సామాజిక చైతన్య సమితి అధ్యక్షులు శేక్ హమీద్ పాష, శ్రీనివాసాచార్యులు, సామ మల్లారెడ్డి, చిన్నయ్య, గాయని సుశీల, కల్యాణి,వివిధ కళాశాల నుంచి విచ్చేసిన విద్యార్థిని విద్యార్థులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిరందాస్‌కు అంతర్జాతీయ అవార్డు

నవతెలంగాణ-చౌటుప్పల్

ప్రముఖ నిర్మాత చిరందాస్ ధనంజయ నిర్మించిన తెలంగాణ స్వతంత్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర డాక్యుమెంటరీ ఫిలింలో అంతర్జాతీయ అవార్డునందుకుంది. బడుగు విజయ్ కుమార్ వైవిధ్యంగా రూపొందించారు. ఈ ఫిలింకు యూనిటీ డాక్యుమెంటరీ ఫిల్మ్ విమర్శకుల ప్రశంసలతోపాటూ అంతర్జాతీయ అవార్డులను అందజేశారు. ముంబయిలో జరిగిన భారత్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్-2023లో యూనిటీ డాక్యు





మెంటరీకి అవార్డులు సొంతం చేసుకుంది. బెస్ట్ హిస్టారికల్ డాక్యుమెంట్ ఫిల్మ్, ఐకానిక్ ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డును యూనిటీ సాధించింది. మైమ్ మధు బాలనటుడు భాను ప్రధాన పాత్రలు పోషిస్తూ బాపూజీ కథను వివరించారు. ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్న డాక్యుమెంటరీ ఫిల్మ్ హైదరాబాద్‌లో ఎంతో మంది సినీ విమర్శకులు, మేధావులు, ఉద్యమకారులు, రాజకీయ నాయకుల ప్రశంసలందుకుంది. తాజాగా అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుతూ అవార్డులు అందుకుంది. సామాజిక న్యాయం కోసం పరితపించిన మహోన్నత శిఖరంలాంటి వ్యక్తి చరిత్రను తెరపైకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందని, ఈరోజు అంతర్జాతీయ వేదికలపై అవార్డులు, ప్రశంసలందుకోవడం మరిచిపోలేని అనుభూతి కలిగిస్తుందని నిర్మాత ధనుంజయ్, దర్శకుడు విజయ్ కుమార్ తెలిపారు.

కుర్రారంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రాజాపేట

మండలంలోని కుర్రారం గ్రామంలో ఎస్డిఎఫ్ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. రూ.5 లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డును గ్రామంలోని జూకంటి సత్తయ్య ఇంటి వద్ద నుండి 130 మీటర్ల వరకు వేయనున్నట్లు మండల పంచాయతీరాజ్ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జూకంటి మమతా బాలస్వామి, మాజీ ఉప సర్పంచ్ బూత్కూరు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ బాల్ద చంద్రయ్య, వార్డు సభ్యులు రావి కొండల్ రెడ్డి, సునీల్, యాదగిరి, ఉట్కూరు సోములు,ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు మేడి శ్రీనివాస్, జూకంటి ఐలయ్య, రాగుల నవీన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

'పాఠశాల అభివృద్ధికి దాతల కృషి అభినందనీయం'

నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి



పాఠశాల అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తున్న దాతల కృషి అభినందనీయమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిల్లాయిపల్లి ప్రధానోపాధ్యాయులు రాధిక అన్నారు. పాఠశాల పూర్వ విద్యా కమిటీ చైర్మన్ కుడుముల యాదిరెడ్డి కుమారుడు, పూర్వ విద్యార్థి అయిన కుడుముల సుధాకర్ రెడ్డి పాఠశాల అభివృద్ధి కోసం ఒక లక్ష రూపాయల నగదును అందజేశారు. అమెరికాలో స్థిరపడిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ అయిన సుధాకర్ రెడ్డి తను చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా గొప్ప మనసుతో ముందుకు రావడం గర్వించదగిన విషయమని కొనియాడారు. సప్తపరిణి గోశాల వారైన సత్యనారాయణ, ఉత్తర గార్లు 9 కుర్చీలను బహూకరించారు. పాఠశాల శ్రేయోభిలాషి గూడూరు అంజిరెడ్డి దాతలను ప్రశంసించారు. అనంతరం దాతలను శాలువాలతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేష్ రెడ్డి, విమలాదేవి, జ్యోతి, ఎల్లయ్య అనురాధ్ కుమార్, సహజీవన్ రెడ్డి, శ్రీదేవి, అమీర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి: ఎస్సై



నవతెలంగాణ-బొమ్మలరామారం

సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఎస్సై గంగిడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బొమ్మలరామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, సమాజంలో జరుగుతున్న పలు రకాల మోసాలపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఫోన్ ద్వారా వచ్చే సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అనవసరమైన లింకులను క్లిక్ చేయవద్దన్నారు. విద్యార్థులు మొదటి ర్యాంకు విజేతకు 5వేల రూపాయలు నగదు బహుకరణ అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే నేడు కోర్టు ఆవరణలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి కోరారు. అన్ని రకాల కేసులు ఉన్నవారు రాజీ పడేందుకు మంచి అవకాశమన్నారు. రాజీమార్గం రాజామార్గమని చిన్నచిన్న విషయాలకు గొడవపడి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృధా చేసుకోవద్దని కోరారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి

నవతెలంగాణ-భువనగిరి



మహిళా సాధికారత కోసం మరింత కృషి జరగాల్సిన అవసరమున్నదని ఇందుకోసం నూతన విధానాలు రూపొందించాలని అక్షన్ ఎయిడ్ హ్యూమన్ రైట్స్ డిఫెండర్ సురుపంగ శివలింగం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని వెటర్నరీ శాఖ మీటింగ్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగం మాట్లాడుతూ మహిళల పట్ల వివక్ష, హింస, అసమానతలు లేని సమాజం కోసం ప్రతీఒక్కరూ కృషి చేయాలని, మహిళల సమగ్రాభివృద్ధికి సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులో సగభాగం ఉండాలన్నారు. గ్రామీణ మహిళల్లో ఇప్పటికి అక్షరాస్యత తక్కువగానే ఉన్నదని, వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల అవగాహన కల్పించాలని ముఖ్యంగా ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్యా ఉపాధి అవకాశాలు, మూఢ నమ్మకాల పట్ల చైతన్యాన్ని చేయవలసిన అవసరం ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ, నర్మదలు పాల్గొని ప్రసంగించగా ఎల్ఆర్‌పి వాలింటర్లు చంద్రకళ, మాధవి, శోభారాణి, స్వప్న, ప్రేమలత, కవిత అంగన్వాడీ టీచర్లు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-చౌటుప్పల్

నేడు (ఈ నెల 16న) జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి నరసింహారెడ్డి కోరారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆవేశంలో చేసిన తప్పులకు, ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగే కక్షిదారుల పాలిట లోక్ అదాలత్ వరం లాంటిదన్నారు. రాజి మార్గమే రాజ మార్గమని, రాజీతో కక్షిదారులు కుటుంబంతో సంతోషంగా జీవితాన్ని గడిపే అవకాశం వస్తుందన్నారు. ఇరు వర్గాలకు రాజీ కుదిర్చి, సత్వర పరిష్కారం లోక్ అదాలత్ తో సాధ్యమవుతుందన్నారు. కక్షిదారుల కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ మంచి అవకాశమన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె చాంద్ పాషా డిమాండ్ చేశారు. పాత టెండర్ మార్చి కొత్త జీతాలు ఇవ్వాలని కోరుతూ మెడికల్ కళాశాల ఎదుట శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది చేస్తున్న సమ్మె శుక్రవారానికి మూడవ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. టెండర్ ను మార్చి పెంచిన జీతాలను ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో రాజు మధు, మురళి, శ్రీను, జమీర్, జానయ్య, లక్ష్మి, లలిత, అండాలు, కరుణ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

కన్న తల్లిదండ్రుల ఆశలు తీర్చడం విద్యార్థులు తమ కర్తవ్యంగా భావించాలని శ్రీ రామకృష్ణ విద్యాలయం ప్రధానాచార్యులు బండిరాజుల శంకర్ అన్నారు. ఆలేరు పట్టణంలో శుక్రవారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడుకోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కోరికలను చంపుకొని, తమ సుఖాన్ని పక్కన పెట్టి తమ బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించే తల్లిదండ్రుల ఋణం తీర్చలేనిదని అన్నారు. సోమవారం నుండి జరుగబోయే పదవ తరగతి పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.విద్యార్థులు తమకు బోధించిన ఆచార్యులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తరిగొప్పుల రమేశ్, ఆచార్యులు జూకంటి సిద్దులు, నారగోని భీమేశ్, బొడ్డు రమేశ్, గుగ్గిళ్ళ జయమ్మ, మాడిశెట్టి వాణిశ్రీ, కడారి పరమేశ్వరి, కాయితి అన్నపూర్ణ, అంబాల ప్రసన్నలక్ష్మి, పెండెం విజయ భవాని, అప్పాల స్వరూప, మైలబోయిన పావని, ఆత్మకూరి దీపిక, యెనగందుల కవిత, యానాల సరస్వతి, గుండు లలిత, వంగపల్లి శ్వేత, పిడిశెట్టి భవాని పాల్గొన్నారు.

మూడు సీట్లు గెలవచ్చనే ... కవితను అరెస్ట్ చేసేందుకు మోడీ ప్లాన్

- మోడీ, కేడీ లు గల్లీలో కొట్టుకుంటూ ఢిల్లీలో దోస్తులవుతారు
- కేసీఆర్ కుటుంబాన్ని కాపాడేది మోడీనే
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేస్తే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వ్యతిరేక ఓటుతో మూడు సీట్లు గెలవచ్చని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆశ పెట్టుకున్నారని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక నేతలను అరెస్టు చేసిన సమయంలో కవితను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు మోడీ, అమిత్ షా రైడ్స్, మ్యాచ్ ఫిక్స్ చేస్తున్నారని అన్నారు. మోడీ, కేడీ గల్లీలో కొట్లాడుకుంటారని ఢిల్లీలో దోస్తులవుతారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ లక్షల కోట్లకు పడగెత్తిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతున్నారని తాము ప్రశ్నిస్తే ఇన్నాళ్ల ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఇక తెలంగాణలో ఉండదని.. బీజేపీ రెండు ఎంపీ సీట్లను కూడా రాష్ట్రంలో గెలవదని అన్నారు. తెలంగాణలో తమకు 14 నుంచి 15 ఎంపీ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

కష్టపడితే సాధించలేనిదేమీలేదు

నవతెలంగాణ-బొమ్మలరామారం



విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యంతో కష్టపడితే సాధించలేనిది ఏమీ లేదని రిటైర్డ్ సైంటిస్ట్ డీఆర్డీఓ పి.నరసింహారావు, రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ కల్నర్ రంజిత్ చాకో అన్నారు. గురువారం మండలంలోని యావపూర్ గ్రామంలో యువ డిఫెన్స్ అండ్ జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశానికి సేవలందించే భావిభారత సైనికులను యువ కళాశాల తయారు చేస్తున్న యజమాని అని కొనియాడారు. విద్యార్థులచే ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు పిరమిడ్ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. జూనియర్ ఇంటర్మీడియట్ తోను, డిఫెన్స్ ఆర్మీ కోర్సులతోనూ అదనంగా అభ్యసించడం గొప్ప అవకాశం అన్నారు.విద్యార్థి దశలోనూ క్రమశిక్షణతో పాటుగా కాలమానపట్టికను రూపొందించుకునే సమయపాలన లో ముందుకు సాగినప్పుడే గొప్పగా ఎదిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యువ కళాశాల డైరెక్టర్ పసుపులేటి వెంకటేశ్వరరావు, నందికంటి భాస్కర్, ప్రిన్సిపల్ శ్రీ శాంతి, భవాని, అకాడమీ డిన్ అబ్దుల్ క్ మన్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కుమార్ స్వామి, అధ్యాపకుబృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చండూరు మున్సిపల్ రోడ్లు, డ్రెయినేజీ పనులు పూర్తయ్యేదెప్పుడో?

నవతెలంగాణ-చండూరు



మండలకేంద్రంలో రోడ్డు విస్తరణ, రోడ్డు కిరువైపులా డ్రైనేజీ అసంపూర్తి పనులతో చండూరు అంతా గందరగోళంగా మారింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా చండూరును అత్యంత సుందరమైన పట్టణంగా తీర్చిదిద్ది ప్రజాకర్షణ పొందేందుకు గానూ రూ.30 కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు విస్తరణ పనులకు అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ 2023 జనవరి 6న శంకుస్థా పన చేశారు. పనులు ప్రారంభించి సంవత్సరం గడిచినప్పటికీ గుత్తేదారు, అధికారుల అల సత్వం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ప్రారంభించిన ఆరంభంలో హడావుడిగా పనులు చేపట్టిన గుత్తేదారు కొంత మేరకు పనులు సాగిన తర్వాత పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ పనులు చేపట్టడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

చండూరు పరిస్థితి..

2022లో జరిగిన ఉప ఎన్నికలలో భాగంగా భారాస అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని చండూరులో సెంటర్ లైటింగ్తో కూడిన రెండు వరుసల రహ దారి నిర్మాణం చేపట్టి అత్యంత సుందరమైన మున్సిపల్ గా తీర్చిదిద్దుతామని అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా ఎన్నికల ముగిసిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రూ.30 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, సుమారు మరో రూ.10 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేసి రహదారి విస్తరణ పనులను ప్రారంభించారు. దీనిలో భాగంగా రెండు వరుసల రహదారికి ఇరువై పుల మురుగు కాల్వల నిర్మాణానికి గుంతలు తవ్వి 'కొంతమేరకు సీసీతో మురుగు కాల్వలు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. మురుగు కాల్వల నిర్మాణం కోసం గుంతలు తవ్వి మట్టిని తరలించే క్రమంలో రోడ్డుపై పడడంతో ఆ మట్టి అంతా రోడ్డుపై పేరుకుపోయి వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము గాల్లోకి ఎగిసి పడి వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాల బారిన పడుతున్నామంటున్నారు. పరిసర ప్రాంతాల్లో ఓ వైపు దుమ్ము, దూళితో మరో వైపు మురుగు కాల్వల నుంచి వచ్చే దుర్వాసనతో, ఉండలేక పోతున్నామని మున్సిపల్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు డ్రైనేజీ త్వరగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకుంటే ప్రజా సంఘాల నాయకుల తో ఉద్యమిస్తాం

గాంధీజీ సేవాసమితి అధ్య క్షుడు గండూరి నర్సింహ



పట్టణంలో రోడ్డు విస్తరణ , డ్రెయినేజీ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టాం. అధికారులు వారం రోజులు పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అయినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకుంటే ప్రజా సంఘాల నాయకుల తో ఉద్యమిస్తామన్నారు.

బిల్స్ రాగానే పనులు మొదలు పెడతాం

మున్సిపల్ కమిషనర్ మణికరణ్

కొంత మేరకు పూర్తయిన డ్రైనేజీ పనులు బిల్స్ చేసి పంపించాం...ఈ నెలలో బిల్స్ వస్తాయి, వచ్చిన వెంటనే రోడ్డు విస్తరణ పనులు మొదలు పెడతాం.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం

నవతెలంగాణ-ఆలేరుటౌన్



దేశంలోని ప్రధాన సమస్యలపై భగత్ సింగ్ ఇచ్చిన ప్రేరణతో బీజేపీ మతోన్మాద పాలనకు వ్యతిరేకంగా యువతరం, విద్యార్థిలోకం ఉద్యమించాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ పిలుపునిచ్చారు. ఆలేరు పట్టణంలో శుక్రవారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో భగత్ సింగ్ 93వ వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సమానత్వం, సమసమాజకోసం జరుగుతున్న పోరాటంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ నెల 15 నుండి 30 వరకు భగత్ సింగ్,రాజు గురు సుఖదేవ్‌ల వర్ధంతులను పిడిఎస్‌యూ, పివైఎల్ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన, వాడవాడనా జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇక్కిరి కుమార్, రాచకొండ ఉదయ్, లక్ష్మణ్, ప్రసాద్ ,రాఘవేంద్ర,యష్వంత్, శ్రవణ్, నరేష్, భువనేశ్వర్, ఉదయ్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై స్పందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆలేరుటౌన్

మండలంలోని గుండ్లగూడెం గ్రామంలో నీటి కొరత ఉన్నదన్న విషయం తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పందించారు. ఊరి ప్రజల నీటి ఎద్దడి పరిష్కారం కోసం శుక్రవారం బోరు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంధ మల్ల అశోక్, పిఆర్‌డిఇ హేమంత్, పిఆర్ఏఇ దామోదర్, ఎం పిడిఓ సత్య ఆంజనేయ ప్రసాద్, ఎంపీఓ ఎంఎ సలీం, నాయకులు దుసరి ఆంజనేయులు ,దూసరి మురళీధర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

నవతెలంగాణ-చౌటుప్పల్



విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాల అధిరోహించాలని ఇంటర్నే షనల్ లైన్స్ క్లబ్ నల్లగొండ జిల్లా మెంబర్ గోశిక కరుణాకర్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిది లోని లక్కారంలోని మోడల్ స్కూల్ లోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షులు కటకం ప్రశాంత్, కోశాధికారి తిరందాస్ జగన్నాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

నవతెలంగాణ-చౌటుప్పల్



బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం 90వ జయంతి వేడుకలను బీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చౌటుప్పల పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్సిరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎర్ర దానయ్య, నాయకులు మస్కు నరసింహ, తగరం సుభాష్ చంద్రబోస్, కత్తుల పద్మ, సుక్క లింగస్వామి, కత్తుల నరసింహ, మాద రమేష్, తూర్పింటి రాములు, సుక్క బుగ్గ రాములు, బెల్లి మల్లయ్య యాదవ్, పులిగిల్ల లింగస్వామి, మస్కు ఉదయ్ కిరణ్, నితీష్, పాల్గొన్నారు.

నిలిచి పోయిన నిర్మాణాలు

- పెద్ద మజిద్ నిర్మాణం నిలిపివేత,
- కోర్టు జోక్యంతో షాదీఖానకు బ్రేక్
- శిలాఫలకానికి పరిమితమైన మైనార్టీ కమ్యూనిటీహాల్ నిర్మాణం
- నిద్రావస్థలో వక్ఫ్ బోర్డు,
- పట్టించుకోని అధికారులు
- ప్రజాదర్బార్ దృష్టికి తీసుకెళ్తాం
- కొత్తగా వచ్చాను....అర్‌అండ్‌బీ ఈఈ ప్రభాకర్

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లాకేంద్రంలో కొన్నేండ్లుగా నిర్మిస్తున్న ముస్లిం మైనారిటీలకు చెందిన వివిధ అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.వీటి గురించి పట్టించుకునేనాథుడే కరువయ్యారు.ఇందులో ప్రధానంగా కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న పెద్దమజీద్,రూ.2 కోట్లతో నిర్మించ నున్న షాదీఖాన, రూ.40లక్షలతో నిర్మించనున్న మైనార్టీ కమ్యూనిటీహాల్ నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయి నెలలు గడుస్తున్నాయి.బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో అప్పటి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి వీటి నిర్మణాలకు స్వీకారం చుట్టిన విషయం తెల్సిందే. కాగా నెలల తరబడి ఈ నిర్మాణాలు ఆగిపోయినప్పటికి వీటి గురించి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వీటిలో ప్రధానంగా పట్టణంలోని గ్రంథాలయం సమీపంలో 450 ఏండ్ల కింద నిర్మించిన పెద్దమజీద్ పునరేకీకరణ కోసం అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. ఇందుకు గాను ఆర్భాటంగా 2018 లో పనులు ప్రాంభించారు.మొదటి విడతలో రూ. 50 లక్షలు మంజూరు కావడంతో మసీదు పనులు మొదలు పెట్టారు.ఇక సాగదితగా అడపాదడపాగా పనులు సాగాయి.చేసిన పనులకు బిల్లు కూడా మంజూరైంది.కానీ నిర్మాణం మాత్రం పిల్లర్ల వద్దకే వచ్చి ఆగింది.నిధులు సరిపోలేదని చెప్పడంతో మరోమారు 2022 లో రూ.50 లక్షలు నిర్మాణానికి మంజూరయ్యాయి.ఇదిగో...అదిగో అంటూ మళ్ళీ పెద్దమసీద్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏడాదికి పైగా నిధులు మంజూరైనప్పటికీ నిర్మాణ పనుల్లో మాత్రం జాప్యం చేస్తూ వచ్చారు.తర్వాత ఏమైందో ఏమో కానీ మసీద్ నిర్మాణపనులను మధ్యలోనే వదిలేశారు.దీంతో కొన్ని నెలలుగా మజీద్ నిర్మాణం నిలిచింది. ఈ రకంగా ఆరేండ్ల నుండి మసీద్ నిర్మాణం కొనసాగడం గమనార్హం.దీని కంటే తర్వాత మంజూరైన వివిధ అభివృద్ధి పనులు పూర్తయి ప్రారంభోత్సవాలు కూడా జరిగాయి.మరి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి కూడా పండుగల సందర్భంగా మసీద్‌ను సందర్శించారు.అయినా కూడా పనులు మాత్రం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే'అన్న చందనంగా పెద్దమసీద్ పరిస్థితి నెలకొంది.దీంతో ముస్లిములు నమాజ్‌సమయంలో నానా ఇబ్బందులు పడుతున్నారు.వక్ఫ్‌బోర్డ్ పరిధిలో ఉన్న పెద్ద మసీద్ ఆలనాపాలన గురించి ఇంతవరకు ఆ శాఖ అధికారులు పట్టించుకోకుండా నిద్రావస్థలో వున్నారు. ఇదిలావుండగా పట్టణ నడిబొడ్డున పాత ఈద్గాలో బలిష్టంగా బహుబలి తరహాలో నిర్మించిన షాదీఖానను కూల్చి ఆ స్థానంలో రెండు కోట్ల రూపాయల వ్యయంతో కొత్త షాదీఖాన నిర్మాణం కోసం జగదీశ్‌రెడ్డి శిలాఫలకం వేశారు.ఈ క్రమంలో పనులు ప్రారంభమై అందులో పిల్లర్లు కూడా వేశారు.ఇది కొనసాగుతున్న క్రమంలోనే ఈ స్థలం మాదంటూ స్థల వారసులు హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చిన విషయం తెల్సిందే. దీంతో షాదీఖాన నిర్మాణానికి బ్రేక్‌పడింది. కాగా ఈ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలా పనులు ప్రాంభించారో అర్థం కాని ప్రశ్నగా మిగిలింది. ఇదిగాక ఈ స్థలంలో సమాధులు కూడా ఉన్నాయి. మరి జగదీశ్‌రెడ్డితో పాటు ఏ ఒక్కరూ కూడా వీటిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతానికి ఈ సమస్య కోర్టు పరిధిలో ఉంది. ఇకపోతే పట్టణంలోని చిన్న



మసీద్ వద్ద గత సెప్టెంబర్ నెలలో ముస్లిముల కోసం రూ.40 లక్షలతో మైనార్టీ కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం జగదీశ్‌రెడ్డి ఫౌండేషన్ వేశారు.నిధులు విడుదల అయ్యాయా....లేదా తెలియదు కానీ పనులు మాత్రం షురూ కాలేదు.ఇది కేవలం శిలాఫలకానికే పరిమితమైంది.ఈ రకంగా పట్టణంలో ముస్లిం మైనారిటీలకు చెందిన వివిధ అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రతిసారి ఎన్నికల సమయంలో మాత్రం వీటిని ప్రచార అస్త్రాలుగా బీఆర్ఎస్ వాడుకుందే తప్ప నిర్మాణపనుల్లో మాత్రం శ్రద్ధ పెట్టలేదని ముస్లిం సంఘాలు విమర్శిస్తున్నాయి. నిలిచిపోయిన నిర్మణాల గురించి మాజీమంత్రి దామోదర్‌రెడ్డిని కలిసి ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేయడానికి కొందరూ ముస్లిములు సమాయత్తమవుతున్నారు.వీటిపై సంబందిత అధికారుల వివరణలు ఈ విధంగా ఉన్నాయి.

కొత్తగా వచ్చాను

ఆర్అండ్‌బీ ఈఈ ప్రభాకర్

పెద్ద మసీద్,షాదీఖానాల నిర్మాణం నిలిపివేత విషయం తెలియదు.తాను కొత్తగా వచ్చా.డీఈ లేదా జేఈకు వివరాలు తెలుసు.

నిధుల కోసం చూస్తున్నాం

ఆర్అండ్‌బీ డీఈ పద్మావతి

పెద్ద మజీద్ నిర్మాణ పనుల ప్రారంభానికి నిధుల గురించి చూస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. షాదీఖాన నిర్మాణం కోర్టు స్టేతో పనులు నిలిచిపోయాయి. దీంతో నిలిపివేశాం.పంచాయతీరాజ్ డీఈ మనోహర్. చిన్న మజీద్ వద్ద నిర్మించనున్న మైనార్టీ కమ్యూనిటీహాల్ నిర్మాణం ప్రభుత్వ ఆదేశాలతో నిలిపివేశాం.

పీఎం విశ్వకర్మ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం సద్విని యోగం చేసుకోవాలని, ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఇన్చార్జ్ శరత్ అన్నారు. మండల కేంద్రంలోని శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు. ఎంపికైన (టైలర్ (ట్రేడ్) అభ్యర్థులకు సలహాలు సూచనలు సిఎస్సి మేనేజర్. ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఇంచార్జ్ శరత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బడుగు జాంగిర్, కటకం రాజు, ఐదో వార్డ్ కౌన్సిలర్ సంగు భూపతి, చింతకింది కీర్తి, వడ్డేమాన్ నరేందర్, ఎలగందుల రమేష్, సుంకరి సృజన్, కటకం వెంకటేష్, ద్వారపు రమణ, పత్తి రాములు, బందెల సుభాష్, సుక్క రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శీతాకాలం ప్రత్యేక శిబిరం

నవతెలంగాణ-మిర్యాలగూడ



పట్టణంలోని కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షమయ్య అధ్యక్షతన శుక్రవారం మండలం లోని యాద్గార్‌పల్లి గ్రామంలో ప్రత్యేక శీతాకాల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. పి.మద్దిలేటి , ప్రిన్సిపాల్ బిక్షమయ్య మాట్లాడుతూ గ్రామంలో వారం రోజుల పాటు విద్యార్థులు సామాజిక సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటమ్మ, ప్రధానోపాధ్యాయులు లావురి బాలు నాయక్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు యమ్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ యన్ కోటయ్య, ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ ఈ రామిరెడ్డి, నరేష్, రేఖ, ఉప్పరీ వెంకన్న, హాము, రమేష్, పంచాయతీ కార్యదర్శి విజయ్ యన్ యస్ యస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

నవతెలగాన-చిట్యాలటౌన్

మండలంలోని వనిపాకల గ్రామ సర్పంచ్ మేడి లింగమ్మ నరసింహ , పాఠశాల ఎస్ఎంసి చైర్మెన్ బర్రె నరసింహ ల పదవీకాలం ఇటీవల ముగిసిన సందర్భంగాజెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు , విద్యార్థులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణాల శ్రీనివాస చారి , దంతూరి సైదులు , గంపల రవీందర్ రెడ్డి , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు కన్నీరు మిగిల్చిన కరువు

- ఎండిపోతున్న వరి పంట పొలాలు
- లబోదిబోమంటున్న రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-ఆత్మకూర్ఎస్



ఎనిమిదేండ్ల నుండి ఎస్సారెస్పీ నీరు కాల్వల ద్వారా రావడంతో రైతులు ఎక్కువ మొత్తంలో వరి పంట సాగు చేశారు. అంతకు ముందు మండలంలో పత్తి,వేరుశనగ, కంది, పెసర, జొన్న వంటి ఇతర ఆరుతడి పంటలు సాగు చేసేవారు.ఎస్సారెస్పీ కాల్వల నుండి నీరు రావడంతో భూములు జాలు పారడంతో చెలకలన్నింటిని పొలాలు చేసి వరిని సాగు చేస్తున్నారు.భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ,బావులు కాలువ నీటిపై ఆధారపడి రైతులు వారి సాగు చేశారు. మండల వ్యాప్తంగా 25వేల ఎకరాలలో వరి పంట వేశారు. వానకాలం కాల్వ నీటితో పాటు బోర్లు,బావులలో నీటి ఊటలతో బయటపడ్డాయి.యాసంగికి కాల్వ నీరొస్తుందన్న ఆశతో రైతులు ఎక్కువ మొత్తంలో వారిని సాగు చేశారు. వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి కాల్వలలో నీరు రాకపోవడంతో బోర్లు ఆగిపోస్తున్నాయి.వరి పొలాలు ఎండిపోయి రైతులకు కన్నీటిని మిగిల్చుతున్నయి.ప్రతి రైతుకు ఒక ఎకరానికి సుమారు రూ.20 నుండి రూ. 25 వేల వరకు ఖర్చు అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా మండలాధికారులు ఎండిపోయిన వరి పంటలను పరిశీలించి తమను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం అందేనా ?

ఈ యాసంగి వరిపంట సాగులో వరిపంటకు నీరు లేక పొలాలు ఎండిపోతున్నాయి.కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతుల కన్నీళ్లను పట్టించుకునే నాథుడే లేడని మండలరైతులు లబోదిబోమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఎండిపోయిన పంటలకైనా సర్వేనెంబర్ ఆధారంగా సర్వే చేసి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

పంటంతా ఎండిపోయింది

సానబోయిన శ్రీశైలం రైతు ఏపూర్

వెంకటాపురం శివారులో మూడెకరాల్లో వరిసాగు చేశా.ఎస్సారెస్పీ నీటితో చెరువు నిండేది.ఇప్పుడు ఎస్సారెస్పీ నుండి నీరురాకపోవడంతో చెరువులో కూడా నీరు తగ్గింది.బోర్లన్ని ఆగిపోస్తున్నయి.దీంతో పంటంతా ఎండిపోయింది.ఫలితంగా పెట్టిన రూ.60 వేల పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది.

బీఎల్ఎఫ్ బలపరిచిన ఎంసీపీఐయూ నలగొండ ఎంపీ అభ్యర్థిగా వస్కుల మట్టయ్య

నవతెలంగాణ-మిర్యాలగూడ



బీఎల్ఎఫ్ బల పరిచిన ఎంసీపీ ఐయూ నల్గొండ ఎంపీ అభ్యర్థిగా వస్కుల మట్ట య్య పేరును ప్రకటి ంచారు. శుక్రవారం హైదరాబాదులో బంగారు భవనంలో జరిగిన బీఎల్ఎఫ్ రాష్ట కమిటీ జనరల్ బాడీ సమావేశంలో వస్కుల మట్టయ్య ను ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల గడ్డ నల్గొండ జిల్లాలో ఎంపీ అభ్యర్థిగా తనను ప్రకటించడం పట్ల బీఎల్ఎఫ్ ,ఎంసీపీఐయూ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు భీమిరెడ్డి నరసింహారెడ్డి, మద్దికాయల ఓంకార్ వారసునిగా నల్లగొండ పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ గా గెలిపించాలని ప్రజలను కోరారు.

శివాజీనాయక్ మృతిపట్ల సంతాపం

నవతెలంగాణ-నాగార్జునసాగర్

మండలంలోని పొట్టేవాని తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ముడావత్ శివాజీ నాయక్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయడ్డాడు. నాగార్జునసాగర్ కమలనెహ్రూ ప్రాంతీయ ఆసుపత్రి హిల్ చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆస్పత్రిలో మృతుని భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి సందర్శించి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో తిరుమలగిరి సాగర్ ఎంపీపీ భగవాన్ నాయక్, నంది కొండ మున్సిపాలిటీ వార్డ్ కౌన్సిలర్స్, మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు,గిరిజన నాయకులు ఉన్నారు.

నివాళులర్పించిన ట్రైకాన్ మాజీ చైర్మెన్

పెద్దవూర : మండలంలోని పొట్టేవాని తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముడావత్ శివాజీ నాయక్ భౌతికకాయాన్ని ట్రైకాన్ మాజీ చైర్మెన్ ఇస్లావత్ రాం చందర్ నాయక్ సందర్శించి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి కృష్ణా రెడ్డి ఆల్ ఇండియా బంజారా సేవా సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాబురావు నాయక్, పీఏసీఎస్ చైర్మెన్ గుంటుక వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు జటావత్ రవి నాయక్, రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మానంద రెడ్డి ,రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గజ్జల లింగారెడ్డి,తదితరులు ఉన్నారు.



నాగార్జునసాగర్...

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

నవతెలంగాణ-చిట్యాలటౌన్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు కరోన్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఉచిత బియ్యం.. రేషన్ కార్డు ఉన్న పేదలకు బ్యాంకు ఖాతాలో డబ్బులు వేసి ఆదుకున్న ప్రధాని మోదీ కి అందరు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శనివారం | మార్చి 16, 2024 | www.navatelangana.com

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై రామ్మూర్తి హెచ్చరించారు. చిన్ననేనిపల్లి గ్రామ శివారులో అక్రమంగా రెండు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండగా ఇచ్చిన సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ట్రాక్టర్ నిర్వాహకలు అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



ఆంధ్ర,తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద నిఘా

నవతెలంగాణ-నాగార్జునసాగర్

ఎన్నికల నేపథ్యంలో సీఐ బిసన్న, ఎస్ఐ సంపత్ ఆధ్వర్యంలో శుక్రవారం నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసి 24 గంటల పాటు వాహనాలను పోలీసులు తనిఖీలను చేశారు. కార్లు, జీపులు, క్రూయిజర్లు, ఆటోలు, ట్యాక్సీలు, డీసీఎంలు, ట్రాలీ ఆటోలు తదితర ప్రైవేట్ వాహనాలను చెక్ చేస్తున్నారు. వాహనాలలో డబ్బులు, ఇతర వస్తువులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.




రైతుబంధు సాయమందక ఇబ్బంది పడుతున్న అన్నదాతలు

- నేటికీ 1951 మందికి చేరని పెట్టుబడి సాయం
- మండలంలో రూ.4,77, కోట్ల బకాయిలు

నవతెలంగాణ-చింతపాలెం

వ్యవసాయ పెట్టుబడి కోసం ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుబంధు పథకం నగదుకోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గత నెల 28వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో సాయం అందకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది. దీంతో వారు కార్యాలయాల చుట్టు తిరుగు తున్నారు. అయినా అధికారులు సరైన సమాధానం చెప్పక పోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపు తొమ్మిది వేల ఐదు వందల ఎకరాలలో ఏడు వేల ఐదు వందల రైతులు వివిధ పంటలను సాగు చేస్తారు. ప్రతీ ఏడాది రైతుబంధు పథకం కింద వీరికి రెండు విడుతలలో ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ. 10,75 కోట్ల పెట్టుబడి సహాయం అందుదేది. గత రబీలో కూడా పూర్తి స్థాయిలో రైతుబంధు డబ్బులు జమ చేశారు. యాసంగిలో కూడా అంతే మొత్తం జమ కావాల్సి ఉంది. జనవరి 28వ తేదీ నాటికి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఫిబ్రవరి మార్చి నెల వరకు కూడా ఖాతాల్లో డబ్బు జమ కాకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.



పెండింగ్‌లో రూ.4 ,77 కోట్లు

మండలంలో 9434 మంది రైతులకు గాను 7483 మంది రైతులకు రైతుబంధు డబ్బు అందగా, ఇంకా 1951 మంది రైతులు ఎదురుచూస్తున్నారు. 7483 మందికి రూ. 10.52 కోట్లు చెల్లించాల్సి ఉండగా, 7483 మంది రైతులకు రూ. 5.74 కోట్లను మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇంకా 1951 మంది రైతులకు సంబంధించి రూ. 4.77 కోట్లను పెండింగ్ లో పెట్టింది. ఇందులో కొందరి రైతులకు 3 ఎకరాల లోపు నగదు జమ అయ్యాయని, 3 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న రైతులకు ఇంకా ప్రభుత్వం జమ చేయలేదని తెలుస్తోంది.

రైతు బంధు ఇవ్వలేని చేతగాని ప్రభుత్వం
రైతు మునగ బక్కయ్య



రైతు బంధు ఇవ్వలేని చేతగాని ప్రభుత్వం. గత ప్రభుత్వం రైతులకు రైతు బంధు సాయం సమయానికి రైతులకు అందజేసింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయినా రైతులకు రైతు బంధు ఇవ్వలేదు.

రైతులకు రైతు బంధు జమ చేయాలి: సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందుల సుందర మౌలేస్వరరెడ్డి



రైతులకు రైతు బంధు జమ చేయాలి. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ప్రభుత్వం రైతు బందు నగదు జమ చేయలేదు. కాంగ్రెస్ ఎన్నికల హామీలలో పెట్టుబడి సాయం కోసం ఎకరాకు పదిహేను వేలు ఇస్తామని చెప్పి పదివేలు మాత్రమే ఇస్తామని చెప్పారు. రైతులను మోసం చేస్తున్నారని చేస్తు న్నారు. యాసంగి పెట్టుబడి సమయం పూర్తి కావస్తున్నా రైతులకు పెట్టుబడి సాయం రైతు బందు జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండల వ్యవసాయ అధికారి: శ్రీనివాస్



మండలంలోని రైతులు రైతుబంధు ఇప్పటి వరకు 9434 మందికి గాను రూ 10.52 కోట్లు, 7483 మందికి సుమారు రూ 5.74 కోట్లు వచ్చాయి. ఇంకా 1951 మంది రైతులకు రూ 4.77 పెండింగ్ లో వుందని తెలిపారు.

గంజాయిపై ఆధిపత్య పోరు

- స్నేహితులే శత్రువులుగా మారిన వైనం
- రెండు వర్గాలుగా చీలి ఒకరిపై మరొకరు దాడి
- రాఖీ హిల్స్ కాలనీ కత్తిపోట్ల ఘటనలో ఏడుగురు అరెస్టు
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ శివరాంరెడ్డి

నవతెలంగాణ-నల్లగొండటౌన్

జాయి ముఠాపై పట్టుసాదించిందుకు జరుగుతున్న ఆధిపత్యపోరులో స్నేహితులే శత్రువులుగా మారారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని గంజాయి మత్తులో పరస్పరం ఒకరిపై మరొకరు దాడికి పాల్పడగా ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని రాఖీహిల్స్ కాలనీ శివాలయం వెనుక జరిగిన కత్తిపోట్ల ఘటనలో ఇరువర్గాలకు చెందిన 11 మందిపై కేసులు నమోదు చేశారు. వారిలో ఏడుగురిని అరెస్టు చేసి రిమాండకు తరలించారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రాఖీ హిల్స్ సంఘటనకు సంబంధించిన వివరాలను డీఎస్పీ కె.శివరాంరెడ్డి వెల్లడించారు. పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందని మేడబోయిన చక్రి, ఎలిశాల అఖిల్ స్నేహితులు. వీరిద్దరు మరికొంత మందితో కలసి తరచూ గంజాయి సేవించేవారు. ఈక్రమంలో చక్రి దూల్ పేట నుంచి గంజాయిని కొనుగోలు చేసి మిత్రులతో కలసి సేవించడమే కాకుండా ఇతరులకు విక్రయించేవారు. అయితే గత జనవరిలో చక్రి వద్ద గంజాయి పట్టుబడటంతో కేసునమోదైంది. దీనికి తన స్నేహత డైన అఖిలేనే కారణమని అతడే పోలీసులకు సమాచారం అందించి ఉంటాడని అప్పటి నుంచి చక్రి అఖిలైపై కక్ష్య పెంచుకున్నాడు. పలుమార్లు ఒకరికొకరు పరస్పరం దూషించుకోవడమే కాకుండా ఎవరికి వారు వేరేవేరుగా గంజాయి ముఠాలను ఏర్పాటు చేసు కున్నారు. తరచూ గంజాయి సేవిస్తూ ఫోన్లలో తిట్టుకునే వారు. దీంతో వారి మధ్య దూరం మరింత పెరిగింది.



అంతమొందించాలనే ఉద్దేశంతో...

తనను పోలీసులకు పట్టించాడంటూ అఖిల్ పై కక్ష పెంచుకున్న చక్రి అఖిల్‌ను అంతమొందించాలనే నిర్ణయానికి వచ్చాడు. అందులో భాగంగా ఈనెల 8న చక్రీ తన బ్యాచ్‌తో కలసి అఖిల్ ఇంటి వద్దకు వెళ్లి ఘర్షణకు దిగాడు. ప్రతిగా అఖిల్ కూడా తన బ్యాచ్‌తో కలిసి చక్రి ఇంటికి పైకి వెళ్లాడు. దీంతో మరింత రెచ్చి పోయిన చక్రి మరుసటి రోజు గ్రీన్‌హౌల్స్ కాలనీ వెనుక భాగంలో తన బ్యాచ్ పట్టణానికి చెందిన మహ్మద్ సమీర్, దోటి ఉపేందర్, కందికట్ల అబిరామ్, గజ్జి హర్షవర్ధన్, వట్టికోట శేఖర్, కొమ్మనపల్లి మహేష్‌లతో కలసి గంజాయి సేవించి మత్తులో అఖిల్‌ను చంపుతామంటూ బెదిరించారు. దీంతో అప్పటికే మత్తులో ఉన్న అఖిల్ కూడా తన బ్యాచ్‌కు చెందిన సురారపు రాజుకు చెప్పగా అతడు తనవెంట నవనీత్, షోయబ్ అనే మరో ఇద్దరితో కలసి కత్తులను తీసుకొని అఖిల్‌తో కలసి చక్రి వద్దకు వచ్చారు. ౧. ఈక్రమంలో అక్కడ ఇరు బ్యాచ్‌ల నడుమ మాటమాట పెరగడంతో కత్తులతో దాడికి దిగారు. ఈ దాడిలో దోటి ఉపేందర్ సూరారపు, రాజులకు తీవ్రగాయలు కాగా చక్రికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు...

ఈ సంఘటనలో ఇరువర్గాలనుండి వచ్చిన ఫిర్యాదుల మేరకు రెండు బ్యాచ్‌లోని 11 మందిపై కేసులు నమోదుచేశారు.వీరిలో చక్రి బ్యాచ్‌లోని ఏడుగురిపై హత్యాయత్నం కేసుతో పాటు అట్రాసిటి కేసును నమోదుచేశారు. అఖిల్ వర్గంలోని నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదుచేశారు. ఈకేసులో అరెస్టు అయిన నవనీత్ నుండి అరకేజీ గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే మొత్తం 11 మంది నిందితుల్లో మేడబోయిన చక్రీ, మహ్మద్ సమీర్, కందికట్ల అభిరామ్, గజ్జి హరవర్ధన్, వటికోట శేఖర్, కొమ్మనపల్లి మహేష్‌తో పాటు గద్దెపాక నవనీత్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సూరారపు రాజు అలిశెట్టి అఖిల్, ఎండి. షోయబ్, దోటి ఉపేందర్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ డానియల్, ఎస్సై లు నాగరాజుగౌడ్, శివప్రసాద్, సిబ్బంది బాలకోటి పాల్గొన్నారు.

బీఎన్ జీవితం ఆదర్శనీయం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపీ భీమిరెడ్డి నర్సింహారెడ్డి జీవితం ఆదర్శనీయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు.బీఎన్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఎంవీ.భవన్‌లో జరిగిన కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు.అనంతరం మాట్లాడుతూ నల్లగొండ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం బీఎన్ చేసిన కృషి మరువలేదన్నారు. మూడుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి నీతిగా,నిజాయితీగా పని చేశారని కొనియాడారు.భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహానీయుడన్నారు.శ్రీరామ్ సాగర్ రెండో దశ పనులుప్రారంభించాలని ఆయన చేసిన పోరాటం మూలంగా నేడు తుంగతుర్తి,సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలలో లక్షలాది ఎకరాలలో వరి పంట సాగవుతుందన్నారు.నీతికి, నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచారని పేర్కొన్నారు. చనిపోయేంతవరకు విలువలకు కట్టుబడి నిడారంబర జీవితాన్ని గడిపారని, యువత ఆయన చూపిన బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రాంతంలో జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకీ పట్టి దొరలు, భూస్వాములు, జాగీర్‌దారులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు.ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోటగోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జిల్లపల్లి నర్సింహారావు, ఎల్గూరి గోవింద్, కొప్పుల రజిత, మిట్టగనుపుల ముత్యాలు, చిన్నపంగనర్సయ్య, ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఎం.రాంబాబు, రణపంగ కృష్ణ, మడ్డి అంజిబాబు, ఏనుగుల వీరాంజనేయులు, షేక్‌సైదా, గుంజ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో మంచినీటి ఎద్దడిని నివారించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జదీపికాయుగంధర్‌రావు

నవతెలంగాణ-తుంగతుర్తి



ప్రజాసమస్యల పరిష్కారం కోసమే మండల సర్వసభ్య సమావేశమని, ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి ఎద్దడినివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు అన్నారు.శుక్రవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుండగాని కవితారాములుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు.ఈ మేరకు గ్రామాల్లో పారిశుద్యం,తాగునీరు, విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సర్పంచుల పదవికాలం పూర్తికావడంతో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలను సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.సర్వసభ్య సమావేశానికి హాజరుకాని గ్రామ ప్రత్యేకాధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు,ఎంపీడీఓ శేషుకుమార్,తహసీల్దార్ రమణారెడ్డి,ఎంపీఓ భీమ్‌సింగ్‌నాయక్,మండల వ్యవసాయ శాఖ అధికారి బాలకృష్ణ,పంచాయతీరాజ్‌ఏఈ రాంబాబు,వెటర్నరీ డాక్టర్లు నరేష్,మమత,మండల విద్యాశాఖ అధికారి బోయిని లింగయ్య,ఉద్యానవన శాఖఅధికారి స్రవంతి పాల్గొన్నారు.

ధాన్యం ధరలు తగ్గిస్తే కఠిన చర్యలు

- డీఎస్ఓ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మిర్యాలగూడ

ధాన్యం ధరలు తగ్గిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో మిల్లర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ధాన్యం నాణ్యత పేరుతో కోతలు విధించరాదని, అలా చేసినట్లయితే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లకు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పి.శ్రీకాంత్, అగ్రికల్చర్ డైరెక్టర్ శ్రవణ్, మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీటీ జావిద్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అంటేనే ప్రజాప్రభుత్వం

- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-బొమ్మలరామారం

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజా ప్రభుత్వమని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని చీకటిమామిడి నుండి మర్యాల వడపర్తి హైవే వరకు రూ.18 కోట్లతో బీటీ డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే చీకటిమామిడి మర్యాల వరకు ఉన్న రోడ్డు అధ్వాన పరిస్థితిగా ఉందన్నారు. కాజీపేట యావపూర్ నుండి ఎర్రగుంట వరకు డబల్ రోడ్డును 10 కోట్ల రూపాయలతో మంజూరు చేసుకున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వమని వారి ముఖాల్లో సంతోషం అనే ఉద్దేశంతోనే రెండు లక్షల రూపాయల రుణామాపిని త్వరలోనే చేయబోతున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్ రెడ్డి, ఎంపీపీ సుధీర్ రెడ్డి,మాజీ సింగిల్ విండో చైర్మన్ మొకు మధుసూదన్ రెడ్డి,ఎంపిటిసిలు హేమంత్ రెడ్డి, శ్రీహరి నాయక్,భగవంతు రెడ్డి, మాజీ సర్పంచ్ చీర సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి చంద్రశేఖర్, బొబ్బిలి నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రామిడి శ్రవణ్ ప్రసాద్ రెడ్డి,నంద రాజ్ గౌడ్, ముద్దం శ్రీకాంత్ రెడ్డి, ఈదులకంటి దయాకర్ రెడ్డి,గుర్రం శ్రీనివాస్ రెడ్డి, తిరుమల కవిత, ఏనగండ్ల వీరేశం, బీక్షపతి గౌడ్, హనుమంత్ గౌడ్, జూపల్లి మహేష్ ,చంద్రమౌళి పాల్గొన్నారు.



సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

సైబర్ మూసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ మోసాలు, సైబర్‌నేరాలపై జిల్లా సైబర్‌సెక్యూరిటీ పై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.సైబర్ నేరాలకు నివారించడంలో అవగాహన కలిగి యువత, విద్యార్థులు వారి తల్లిదండ్రులను, స్నేహితులను, బంధువులను చైతన్యవంతం చేయాలన్నారు.ఆన్‌లైన్ లావాదేవీలలోనే ఎన్నో మోసాలు జరుగుతున్నాయని చెప్పారు.ముఖ్యంగా బ్యాంకింగ్ రంగానికి సంబంధించి ప్రతినిత్యం ఎన్నో రకాల ఫోన్లు, మెసేజ్‌ల రూపంలో మోసగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని,ప్రజలు ప్రమత్తంగా ఉండాలన్నారు.మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నెంబర్, www.cybercrime.gov.in వెబ్‌సైట్ నందు ఫిర్యాదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పోలీస్ టెక్నికల్ సిబ్బంది మహేష్, సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతన్న

నవతెలంగాణ-ఆత్మకూర్(ఎస్)



నకిలీవిత్తనాలతో తానునష్టపోయాయని మండల పరిధిలోని కందగట్ల గ్రామానికి చెందిన ఏర్పుల సైదులు ఆరోపించారు.శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సూర్యాపేటకు చెందిన సాయిభవ్య విత్తనాలు షాపులో సన్న రకం చింట్లు వరి విత్తనాలను కొనుగోలు చేసి ఐదెకరాల్లో సాగు చేశానని తెలిపాడు.సన్న రకాల వరి ధాన్యంలో ఆర్ఎన్ఆర్ దొడ్డు రకం వరి విత్తనాలు కలవడంతో విత్తనాలు ముందుగా కోతకు వచ్చాయని, సన్నరకాలు ఆలస్యంగా వస్తున్నాయని,దీని కారణంగా దిగుబడి అంతరాయం ఏర్పడుతుందని వాపోయారు. కల్తీ విత్తనాలను అమ్మిన షాపు యజమానికి సమాచారం ఇవ్వగా పరిశీలించి కంపెనీకి సమాచారం ఇస్తామని తర్వాత ఫోన్ కూడా చేయడం లేదంటూ ఆరోపించాడు.ఈ విషయమై మండల వ్యవసాయ శాఖకు ఫిర్యాదు చేయగా వారిపై రెండు పరిశీలించారని, వాస్తవంగా సన్న రకాల్లో దొడ్డు రకం విత్తనాలు కలిసినట్టుగా నిర్ధారించారన్నారు.నకిలీ విత్తనాలను విక్రయించిన సాయిభవ్య ఎరువుల షాపు యజమానిపై చర్యలు తీసుకోవడంతో పాటు తనకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

నకిలీ విత్తనాలతో నష్టం జరిగింది వాస్తవమే
ఏఈఓ రాచకొండ శివకుమార్

కందగట్లకు చెందిన రైతు సైదులు వేసిన వరి సాగులో కల్తీ విత్తనాలు వచ్చిన మాట వాస్తవమే.పొలాన్ని పరిశీలించి వివరాలను ఉన్నతాధికారులకు అందజేశా.

'యువత స్వశక్తితో ఎదగాలి'

నవతెలంగాణ-చింతపల్లి

యువత స్వశక్తితో ఎదగాలని డిసిసి మెంబర్ దొంతం సంజీవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ హరి నాయక్, తాజా మాజీ సర్పంచ్ రాటకొండ రుద్రమదేవి నరేంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కురుమేడ్ ఎక్స్ రోడ్‌లో శ్రీ ముత్యాలమ్మ తల్లి రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గాదరి జంగయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు కురుమేటి వెంకటరమణ,కాంగ్రెస్ జిల్లా నాయకులు రాటకొండ నరేంద్ర ప్రసాద్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కుంభం శ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్ నాదిరమేష్,గౌనిజంగయ్యగౌడ్, మాజీఎంపిటిసి పొగాకు సోమప్ప పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

గ్రామ గ్రామాణ పార్టీలకతీతంగా ఇండ్లులేని అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిఇస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్పు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా మంజూరైన నిధులతో సిసి రోడ్లను ఆలేరు మండలం గొలనుకొండ, శారాజిపేట, టంగు టూరు, కొల్లూరు, మందనపల్లి, కంది గడ్డ తండా, పటేల్ గూడెం, శ్రీనివాసపురం, కొలనుపాక గ్రామాలలో శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. త్వరలోనే రైతులకు తీపి కబురు అందుతుందని, రుణమాఫీ చేసే విధంగా చర్యలు ప్రభుత్వం తీసుకుంటుంది అన్నారు. రానున్న ఎంపీ అభ్యర్థికి సైతం 60 వేల మెజార్టీ ఇవ్వాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, పారునంది భాస్కర్,ఎంపీపీ గంధమల అశోక్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో సత్య అంజనేయ ప్రసాద్, సిఐ కొండలరావు, ఎస్ఐ వెంకట శ్రీనివాస్, వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కే వెంకటేశ్వరరాజు, నాయకులు తుంగ కుమార్, బీజన భాస్కర్, ఉట్కూరి అంజయ్య , ఉట్కూరి సురేష్, కాన్రాజు శివ, గాజుల దశరథ, కృష్ణయ్య , స్వామి, పాల్గొన్నారు.

నా బలం....బలగం బ్రాహ్మణవెల్లెంలనే

- త్వరలో ఉదయ సముద్రం ప్రాజెక్టు పూర్తి చేస్తా
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖమంత్రి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

రాష్ట్రానికి మంత్రి అయినా బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి కొడుకేనని కన్న ఊరు కన్నతల్లి రుణం తీర్చుకోవడానికి నా వంతుగా కృషి చేస్తానని నా బలం బలగం బ్రాహ్మణవెల్లెంల అని రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ సినిమా ఫోటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని స్వగ్రామం బ్రాహ్మణవెల్లంలలో రూ.67 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు జెడ్పీచైర్మెన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ లో పార్టీలో కేవలం మిగిలేద కేసీఆర్ నలుగురు కుటుంబ సభ్యులే అని విమర్శించారు.తాను మంత్రిగాఉన్న జిల్లాలో ప్రజలకు మెరుగైన సౌకర్యలు కల్పించి చనిపోయిన తరువాత కూడా వారు గుర్తు పెట్టుకునేలా పనులు చేస్తానని హామీ ఇచ్చారు. బాహ్మణవెల్లెంల ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంతో పాటు, సోలార్‌గ్రామంగా మారుస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలోఆర్డీవో రవి, ఎంపీపీ సూదిరెడ్డి నరేంద్రరెడ్డి,ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య,ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఉశయ్య, పట్టణఅధ్యక్షుడు భరత్, మాజీ ఉప సర్పంచి భూపాల్రెడ్డి, మాజీ సర్పంచి అచ్చాలు, సత్తయ్య, సట్టు సత్తయ్య పాల్గొన్నారు.



మంత్రిగారు ఆలకించండి.. ఎమ్మెల్యే వేముల వీరేశం

బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, నార్కట్ పల్లి ఆర్టీసీ బస్ డిపోను తిరిగి ప్రారంభించేందుకు బస్సుల సంఖ్య పెంచాలని ధర్మారెడ్డి కాల్వ పిల్లాయిపల్లి కాలువలను పూర్తి చేయాలని మంచి స్వగ్రాంలో జరిగిన సమావేశంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మంత్రిని కోరారు.